RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 224 మేడ్చల్ మల్కాజ్‌గిరి 5 సెప్టెంబర్ 2024 గురువారం పేజీలు : 4

## బీజేపీ రాజ్యాంగ వ్యతిరేక రూపం బట్టబయలైంది

న్యూఢిల్లీ : నిందితుల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చడం పై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలతో బీజేపీ రాజ్యాంగ వ్యతిరేక రూపం బట్టబయలైందని కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ అన్నారు. నిందితులైనంత మాత్రాన వాళ్ల ఇళ్లను కూల్చే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని సుప్రీంకోర్టు ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఆయన తన ట్విటర్ పోస్టులో ప్రస్తావించారు. బీజేపీ అన్యాయమైన, రాజ్యాంగ వ్యతిరేకమైన బుల్డోజర్ నీతిపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలను స్వాగతిస్తున్నామని చెప్పారు. బుల్డోజర్ల కింద మానవత్వం, న్యాయాలను తొక్కేసిన బీజేపీ రాజ్యాంగ వ్యతిరేక రూపం సుప్రీం వ్యాఖ్యలతో బట్టబయలైందన్నారు. అంతులేని అధికారానికి ప్రతీకగా మారిన బుల్డోజర్ మానవ హక్కులను మంట గలుపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

# పొంగి పొర్లుతున్న వాగులు... వంకలు...




అమరావతి / హైదరాబాద్ : బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా రెండు తెలుగు రాష్ట్రాలను వరదలు ముంచెత్తాయి. దీంతో ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాగులు, వంకలు, నదులు పొంగిపొర్లి పదుల సంఖ్యలో ప్రాణాలు తీశాయి. ఇళ్లల్లోకి భారీగా వరదనీరు చేరి ఆహారం, మంచినీళ్లు లేక వరద బాధితులు ఆర్తనాదాలు చేశారు. మరోవైపు భారీ వర్షాలు, వరదలకు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రాజెక్టులకు పెద్దఎత్తున వరదనీరు పోటెత్తింది. వర్షాలు కాస్త తగ్గుముఖం పట్టడంతో కొంత మేర నదులు శాంతించాయి. ప్రస్తుతం ప్రాజెక్టుల వద్ద తాజా పరిస్థితి ఎలా ఉందో ఇప్పుడు చూద్దాం..

**ప్రకాశం బ్యారేజ్..** విజయవాడ ప్రకాశం బ్యారేజ్‌కి నిన్న ఉదయం నుంచీ క్రమంగా వరదనీటి ప్రవాహం తగ్గుతోంది. ప్రస్తుతం బ్యారేజ్‌కు 4.56లక్షల క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. బ్యారేజ్ దిగువ భాగాన కృష్ణానది ముంపు గ్రామాల ప్రజలు ఇప్పుడిప్పుడే వరద ప్రభావం నుంచి బయటపడుతున్నారు. మరోపక్క గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని పలు గ్రామాల్లో వరద ప్రభావం క్రమంగా తగ్గుతోంది. అయితే ఇటీవల ప్రకాశం బ్యారేజ్‌కు రికార్డుస్థాయిలో 11లక్షల క్యూసెక్కులకు పైగా వరదనీరు చేరిన విషయం తెలిసిందే.

**తుంగభద్ర జలాశయం..** కర్నూలు జిల్లా తుంగభద్ర జలాశయానికి వరదనీరు కొనసాగుతోంది. పూర్తిస్థాయి నీటి మట్టం 1,633అడుగులు కాగా.. ప్రస్తుతం 1,631.92 అడుగులకు చేరుకుంది. ఇన్ ఫ్లో 39,945 క్యూసెక్కులు కాగా.. ఔట్ ఫ్లో 15,235 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు, ప్రస్తుతం నీటి నిల్వ సామర్థ్యం 101.461 టీఎంసీలుగా ఉంది.

**నాగార్జున సాగర్ ప్రాజెక్టు..** నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఉదయం 10గంటల సమయానికి ప్రాజెక్టు 10గేట్లు ఐదు అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు ఇన్ ఫ్లో 1,88,549క్యూసెక్కులు కాగా.. ఔట్ ఫ్లో 1,16,535 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 586.20అడుగులకు చేరుకుంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.045 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 301.35 టీఎంసీలకు చేరుకుంది.

**శ్రీశైలం జలాశయం..** నంద్యాల శ్రీశైలం జలాశయానికి వరదనీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ఇన్ ఫ్లో 1,43,199క్యూసెక్కులు ఉండగా.. ప్రాజెక్టు గేట్లు ఎత్తి 67,897క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 883.50 అడుగులకు చేరింది. మరోవైపు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టీఎంసీలు ఉండగా.. ప్రస్తుతం 208.7 టీఎంసీలకు చేరుకుంది. కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

**లోయర్ మానేరు..** కరీంనగర్ జిల్లా లోయర్ మానేరు డ్యామ్‌కు భారీగా వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. ఇవాళ మధ్యాహ్నం లోపు లోయర్ మానేరు డ్యామ్ గేట్లు ఎత్తి అధికారులు నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 24టీఎంసీలు ఉండగా.. ప్రస్తుతం 17టీఎంసీలకు నీరు చేరింది. 35వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండటంతో మధ్యాహ్నానికి గేట్లు ఎత్తే అవకాశం ఉంది. దీంతో మానేరు నదీ తీర ప్రాంత ప్రజలు, రైతులను అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

**జూరాల ప్రాజెక్టు..** మహబూబ్ నగర్ జిల్లాలోని జూరాల ప్రాజెక్టు వరద తగ్గుముఖం పట్టింది. పూర్తిస్థాయి నీటిమట్టం 318.516మీటర్లు కాగా.. ప్రస్తుతం 317.810మీటర్లకు వరదనీరు చేరింది. ప్రాజెక్టు ఇన్ ఫ్లో 1,35,000 క్యూసెక్కులు ఉండగా.. పూర్తి అవుట్ ఫ్లో 94,893క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు 9గేట్లు ఎత్తి స్పిల్ వే ద్వారా 61,830 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి ద్వారా మరో 32,339 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 9.657టీఎంసీలు ఉండగా.. ప్రస్తుతం 8.241టీఎంసీలకు చేరుకుంది.

**కోయల్ సాగర్ ప్రాజెక్టు..** మహబూబ్ నగర్ జిల్లాలోని కోయిల్ సాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఇన్ ఫ్లో 2,800 క్యూసెక్కులుగా ఉండగా.. ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తి 2,800క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 2.270టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 1.008టీఎంసీలుగా ఉంది.

**భద్రాచలం..** భద్రాద్రి కొత్తగూడెం భద్రాచలం వద్ద గోదావరి 42.40అడుగుల వద్ద కొనసాగుతోంది. ప్రస్తుతం ఇన్ ఫ్లో 9,07,569క్యూసెక్కులుగా ఉంది. అయితే గోదావరి 43 అడుగులు దాటగానే అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు.

**కడెం ప్రాజెక్టు..** నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టుకు 22వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు ఐదు గేట్లు ఎత్తి 31వేల క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700అడుగులు కాగా.. ప్రస్తుతం నీటిమట్టం 695.475అడుగులకు చేరుకుంది.

**శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు...** మంచిర్యాల జిల్లా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరదనీటి ప్రవాహం కొనసాగుతూనే ఉంది.

ప్రాజెక్టు ఇన్ ఫ్లో 4.52లక్షల క్యూసెక్కులు ఉండగా.. 32గేట్లు ఎత్తి 4.82లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పూర్తి సామర్థ్యం 20.175టీఎంసీలు ఉండగా.. ప్రస్తుతం 14.4043టీఎంసీలకు వరదనీరు చేరింది.

**మేడిగడ్డ బ్యారేజ్..** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మేడిగడ్డ బ్యారేజీకి 8,85,620 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో బ్యారేజ్ మొత్తం 85గేట్లు ఎత్తి అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

**నిజాంసాగర్ ప్రాజెక్టు..** కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టుకు భారీగా వరదనీటి ప్రవాహం పెరిగింది. ప్రాజెక్టుకు 28వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు కాగా.. ప్రస్తుతం 1403.02 అడుగులకు చేరుకుంది. మరోవైపు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 17.802టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 15.006 టీఎంసీలకు వరదనీరు చేరింది.

**సింగూర్ భాగారెడ్డి ప్రాజెక్టు..** సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూర్ భాగారెడ్డి ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వచ్చి చేరింది. ఇన్ ఫ్లో 43,028 క్యూసెక్కులు ఉండగా.. ఔట్ ఫ్లో 401 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 23.950 టీఎంసీలకు చేరుకుంది.



## ఇంత విపత్తులోనూ మత్తులో జోగుతున్నారా...!?

## ఖమ్మం అంత మునిగాక కూడా కేసీఆర్ వెళ్లరా?

### జనాల్లో నానాటికీ తగ్గుతోన్న బీఆర్ఎస్ గ్రాఫ్

ప్రజలకు కష్టం వచ్చిన వేళ.. వారికి ఓదార్పును ఇవ్వటానికి.. ధైర్యం చెప్పటానికి.. వారికి తాము అండగా ఉన్నామన్న విషయాన్ని చెప్పేందుకు అధినేతలు స్పందించాల్సి ఉంది. చేతిలో అధికారం ఉంటేనే కాదు.. లేకున్నా కూడా రియాక్టు కావొచ్చు. ఏపీలో విరుచుకుపడిన వరదలతో విజయవాడ ఆగమాగం కావటం తెలిసిందే. విజయవాడ జల విలయంపై రియాక్టు అయిన వైసీపీ అధినేత.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బాధిత కుటుంబాల వద్దకు వెళ్లటం.. వారిని పరామర్శించటం తెలిసిందే. ఏపీలో విజయవాడ మాదిరే తెలంగాణలోనూ ఖమ్మం పట్టణం వరదపోటుకు దారుణంగా దెబ్బతింది. ప్రాణ నష్టం వాటిల్లింది. సాయం కోసం అక్కడి ప్రజలంతా ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇలాంటి వేళలో.. బాధితులకు ధైర్యం చెప్పేందుకు.. వారి కష్టాల గురించి తెలుసుకొని.. ప్రభుత్వ వైఫల్యాల్ని ఎత్తి చూపేందుకు విపక్ష నేతగా ఉన్న కేసీఆర్ బయటకు రావాల్సి ఉంది. అదేం సిత్రమో కానీ.. విపక్ష నేతగా ఉన్న వేళలోనూ ఫాంహౌస్ కు పరిమితమైన కేసీఆర్ అక్కడి నుంచి బయటకు రావటం హాట్ టాపిక్ గా మారింది. మొన్నటికి మొన్న బడ్జెట్ సమావేశాల సమయంలో తాను ప్రజల తరఫున పోరాటం చేస్తానని.. రేవంత్ సర్కారుపై నిప్పులు చెరిగిన కేసీఆర్.. ఆ తర్వాత నుంచి మళ్లీ పత్తా లేరు. తాజాగా కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో తీవ్రంగా నష్టపోయిన ఖమ్మం పట్టణాన్ని సందర్శిస్తారని.. బాధితుల వెతల్ని వింటారని భావించారు. భారీ వరద కారణంగా గడిచిన మూడు రోజులుగా అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికి..కేసీఆర్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన రాలేదు. సాధారణంగా విపత్తులు విరుచుకుపడిన వేళలో.. అధినేతలు స్పందించటం.. వెంటనే బాధిత ప్రాంతాలను సందర్శించి.. బాధితులకు ధైర్యం చెప్పటం మామూలే. కానీ.. కేసీఆర్ మాత్రం అందుకు భిన్నంగా ఇప్పటివరకు ఒక్కటంటే ఒక్క ప్రకటన చేయకపోవటం సంచలనంగా మారింది. బాధ్యతాయుతమైన ప్రతిపక్షం స్పందించాల్సిన సమయంలోనూ కామ్ గా ఉండటం కేసీఆర్ ఇమేజ్ ను డ్యామేజ్ చేస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.




2024, సెప్టెంబర్ నెలలో.. 7, 17వ తేదీలను సెలవు దినాలుగా ప్రకటిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.. మిలాద్ ఉన్ నబీ, గణేష్ చతుర్థి పండుగలకు తెలంగాణ ప్రభుత్వం సెలవులు ప్రకటించింది.

సెప్టెంబర్ 7వ తేదీ గణేష్ చతుర్థి, సెప్టెంబర్ 17న మిలాద్ ఉన్ నబీకి హాలీడే ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, తెలంగాణ సాధారణ సెలవుల క్యాలెండర్ ప్రకారం.. 7వ తేదీ గణేష్ చతుర్థి, సెప్టెంబర్ 16న మిలాద్ ఉన్ నబీకి సెలవుగా డిక్లేర్ చేశారు. అయితే, నెలవంక దర్శనం తేదీని బట్టి మిలాద్ ఉన్ నబీ హాలీ డే డేట్ మారింది. మొదట నిర్ణయించిన 16న కాకుండా.. 17వ తేదీని మిలాద్ ఉన్ నబీ హాలీడే గా ప్రభుత్వం తాజాగా డిక్లేర్ చేసింది.




# ఖమ్మం వరద బీభత్సానికి అసలు కారణమిదేనా..!

## వరద నీరు వెళ్లేదారి లేకనే..!!

### అధికారుల తప్పిదాలు, అక్రమార్కుల అత్యాశ - ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో భవంతుల కట్టడాలు

### డ్రెయినేజీలు మూసి నిర్మాణాలు, రోడ్లపైకి ర్యాంపులు - నాలాలు మూసేసి నిర్మాణాలు

ఖమ్మం : నిన్న మొన్నటివరకు సుందరీకరణకు మారుపేరుగా ఉన్న ఖమ్మం నగరం ఒక్కరాత్రిలోనే మురికి కూపంగా మారింది. రెండు తెలుగురాష్ట్రాల రాకపోకలకు కేంద్రబిందువుగా ఉన్న జిల్లా కేంద్రం ఒక్కరోజు కురిసిన వర్షానికే జలదిగ్భంధం అయింది. నగర పాలక సంస్థ పరిధిలోని ఒకటి, రెండు డివిజన్లు మినహా మిగిలిన అన్నీ ప్రాంతాల్లో మోకాళ్లలోతు నీళ్లు నిలిచి జనజీవనం స్తంభించింది. అయితే ఖమ్మం అర్బన్ పరిధిలో శనివారం కురిసిన వర్షం కంటే కూడా పెద్దఎత్తున వర్షపాతం నమోదైన సంఘటనలు బోలెడున్నాయి. కానీ ఆయా సమయాల్లో ఎన్నడూ లేనివిధంగా నగర పాలక సంస్థ పరిధిలోని పదులకొద్దీ డివిజన్లు ముంపునకు ఎందుకు గురవుతున్నాయనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. మున్నేరు బ్రిడ్జిలపై నుంచి నీళ్లు పొంగేస్థాయిలో వరద రావడం ఇది నాలుగోసారి కాగా, ఆ నాలుగుసార్లు కూడా ఇదే రకమైన పరిస్థితులు నెలకొనడంతోపాటు యేటికేడు వరద ముప్పు తీవ్రతరమవుతున్నట్టుగా తెలుస్తోంది. కాగా గతంలో అంతకుమించిన వర్షాలు పడిన సమయంలో కొద్దిగొప్ప నష్టం ఉన్నప్పటికీ ఇంతటిస్థాయిలో జననివాసాలు ముంపునకు గురవడం గడిచిన రెండేళ్ల కాలంగానే జరుగుతున్నట్టుగా తెలుస్తోంది.

**వరద వెళ్లేదారిలేకనే ముంపు :** ప్రస్తుతం కురిసిన వర్షాలతో ఖమ్మం నగరం అతలాకుతలమైన పరిస్థితులు నెలకొన్నాయి. వాస్తవానికి మున్నేరుకు వరద పెరిగిన సమయంలో మున్నేరు నదీ ప్రవాహానికి సమీపంలో ఉన్న ప్రాంతాలు మాత్రమే ప్రభావితమయ్యేవి. కానీ గతేడాది వర్షాలు కురిసిన సమయంలో ఖమ్మం నగరంలోని మరికొన్ని ప్రాంతాలకు వరద నీరు చేరుకుని ఇళ్లల్లో నీళ్లు నిలిచిపోయాయి. కాగా శనివారం కురిసిన వర్షాలకు మాత్రం ఖమ్మం నగరం మొత్తం వరదనీటితో నిండిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మున్నేరు నదీ ప్రవాహానికి చేరువలో ఉన్న దానవాయిగూడెం, రామన్నపేట, మోతీనగర్, వెంకటేశ్వరనగర్, రంగనాయకులగుట్ట, ప్రకాష్‌నగర్, బొక్కలగడ్డ, పద్మావతినగర్ ప్రాంతాలు పూర్తిగా నీటమునిగిపోయాయి. ఆయా ప్రాంతాల్లో రెండు, మూడు ఫ్లోర్లు ఇళ్లు మొత్తం కనిపించని పరిస్థితి ఏర్పడింది.

**ఇదే అసలు కారణం..** వాటన్నింటికీ కారణంగా మున్నేరు తీవ్రంగా ప్రవహించడంతో వరదనీరు కలిసే అవకాశం లేని కారణాన్ని కొందరు చెబుతున్నప్పటికీ.. ఎగువనుంచి ఎగబాకిన వరదనీరు వెళ్లేదారిలేకపోవడంతో దిగువన ఉన్న ప్రాంతాలన్నీ ముంపునకు గురయ్యాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రఘునాథపాలెం నుంచి బల్లేపల్లి, పాండురంగాపురం, అమరావతినగర్, విద్యానగర్ నుంచి వచ్చే వరదనీరు మొత్తం ఖానాపురం చెరువుమీదుగా లకారం మీదుగా మున్నేరులో కలవాల్సి ఉంటుంది. మిగిలిన ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు సైతం ఇదేరీతిలో బయటకు వెళ్లాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం ఆ దారులన్నీ మూసివేసిన కారణంగా ఎక్కడి నీరు అక్కడే నిలిచి ఇళ్లకు ఎగబాకినట్టు తెలుస్తోంది. అయితే ఇంతటిస్థాయిలో నష్టం జరగడానికి కారణం సుందరీకరణ పేరుతో పార్కులు ఏర్పాటు చేసి వరద వెళ్లేందుకు దారిలేకుండా అడ్డుకట్ట వేయడం కూడా కారణమేనంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

**బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లలో నిర్మాణాలు..** మున్నేరు నది, ఖానాపురం, లకారం వంటి చెరువులు, ఆయా చెరువులకు అనుసంధానంగా చైన్‌లింక్ కాల్వల పరిధిలో ఎలాంటి భూములున్నా సరే.. వాటికి సంబంధించి క్రయ విక్రయాలు సాగకూడదు. ఆయా ప్రాంతాల్లో వెంచర్లకు, ప్లాట్లకు సంబంధించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టడానికి అనుమతులు నిషేధం. కానీ సాధారణ భూములకు మాదిరే అన్నీ రకాల పనులు సాగించారు. అక్కడ ఎలాంటి నిర్మాణాలు జరగకుండా అడ్డుకోవాల్సిన అధికారులు భూముల రిజిస్ట్రేషన్ల నుంచి మొదలుకుని ఇళ్ల నిర్మాణాలు, వాటికి అనుమతులు సైతం మంజూరుచేశారు. ఆయా అక్రమ నిర్మాణాల కారణంగా ఇలాంటి వరదలు వచ్చినప్పుడు ఆయా ఇళ్లకు నీరు పోటెత్తడం పరిపాటిగా మారిందన్న విమర్శలు లేకపోలేదు.

**డ్రెయినేజీలు మూసేసి..** మున్నేరు పరివాహక ప్రాంతంలోని బఫర్‌జోన్‌లో, ఎఫ్‌టీఎల్‌లలో జోరుగా భవంతులు నిర్మాణాలు జరగ్గా.. నగరంలో సైతం అదేరీతిలో కాల్వలను కబ్జాచేసి మరీ నిర్మాణాలు చేపట్టారు. భారీ ఎత్తున అపార్ట్‌మెంట్లు నిర్మించారు. పలు అపార్ట్‌మెంట్లలో అండర్‌గ్రౌండ్ పేరుతో లోపలికి వెళ్లిన వరదనీరు బయటకు వెళ్లే అవకాశం లేకుండా సెల్లార్లు నిర్మించారు. డ్రెయినేజీలను ఆక్రమించి రోడ్లపైకి నిర్మాణాలు చేశారు. పెద్ద ఎత్తున ర్యాంపులు వేసి డ్రెయినేజీలు మూసేశారు. కొన్ని ప్రాంతాల్లో అయితే మాస్టర్‌ప్లాన్‌లో బఫర్‌జోన్‌లో ఉన్న స్థలాలకు సైతం లోకేషన్లు మార్చి అనుమతులు మంజూరు చేసిన సంఘటనలు ఖమ్మం కార్పొరేషన్‌లో ఉన్నాయి. ఇవన్నీ ఇలా ఉండటంతోపాటు మిగిలిన వరదనీరు సైతం బయటకు వెళ్లేందుకు మార్గం లేక కట్టలు కట్టిన కారణంగా ఆయా డివిజన్లలో నీళ్లు నిలిచిపోయినట్టుగా తెలుస్తోంది.

**నిద్రలు లేకుండా..** ఫలితంగానే మంత్రుల నుంచి మొదలుకుని జిల్లాస్థాయి ఉన్నతాధికారులు సైతం నిద్రలు లేకుండా శ్రమించాల్సిన పరిస్థితులు ఏర్పడిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో వరదలు వచ్చిన సమయంలోనే వీటిపై దృష్టిసారిస్తే ప్రస్తుతం ఇంతటిస్థాయిలో నష్టం ఉండేదికాదన్న వాదన వినిపిస్తుంది. ఒక్క రాత్రి కురిసిన వర్షానికే ఖమ్మం నగరం పరిస్థితి ఇలా తయారైతే మున్ముందు భారీ ఎత్తున వర్షాలు పడితే ఎంతటిస్థాయిలో నష్టం జరుగుతుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

**బురదమయమైన బతుకులు :** మున్నేరు పరివాహక ప్రాంత ప్రజలకు ఏటా కన్నీటి కష్టాలు తప్పడం లేదు. భారీ వర్షాలు వరదల సమయంలో ముంచుకొస్తున్న ముప్పు గురిం చి అధికా రయంత్రాంగంతో పాటుగా తాము ఓట్లేసి గెలిపించిన ప్రజా ప్రతినిధులు కూడా కనీసం పది నిమిషాల ముందు కూడా సమాచారం ఇవ్వలేదని బాధితులు కన్నీరు పెట్టారు. ఆకస్మికంగా ఇంటిని చుట్టు ము ట్టిన వరదతో పిల్లలతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఇంటి నుంచి బ య పడ్డామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవ త్సరం కూ డా వరద వచ్చినా ఇంత స్థాయిలో నష్టం జరగ లేదన్నారు.

## సంపాదకీయం


### భారత్ పై కడుపులో ద్వేషం.. పైకి సందేశం..
### ఇదీ బంగ్లా సారథి నిజ స్వరూపం!

ఆయనో ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతి గ్రహీత. వయసు 84 ఏళ్లు.. సరే.. ఇంకా ఆరోగ్యంగానే ఉన్నారు అందరికీ సంతోషం. ఇలాంటి సమయంలో అనూహ్యంగా దేశాన్ని పాలించే అవకాశం దక్కింది. మంచికో చెడుకో దీనిని సద్వినియోగం చేసుకుంటూ.. పెద్దన్నలాంటి పొరుగు దేశంతో సత్సంబంధాలు ఏర్పరచుకుంటే పరస్పరం బాగుంటుంది. కానీ, ఆయన అలాంటివాడు కాదు. నిలువెల్లా ద్వేషం నింపుకొన్న వాడు. అందుకనే తనలాంటి వారిని చేరదీస్తున్నాడు. ఇదంతా బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి మొహమ్మద యూనస్ గురించి. ఇదిగో ఇదే సాక్ష్యం సరిగ్గా నెల కిందట కూడా మొహమ్మద్ యూనస్ జీవించి ఉన్నట్లు ఎవరికీ తెలియదు. అనూహ్యంగా బంగ్లాదేశ్ లో షేక్ హసీనా ప్రభుత్వం పడిపోవడంతో ఫ్రాన్స్ లో ఉన్న యూనస్ ను పిలిచి మరీ ప్రభుత్వ అధినేతను చేశారు. అయితే, ఈ అవకాశం దక్కే సమయంలోనే ఆయన భారత్ పై తీవ్ర విమర్శలు చేశారు. తమ దేశ అంతర్గత వ్యవహారాల్లో భారత్ జోక్యం చేసుకుంటోందంటూ లేనిపోని ఆరోపణలకు దిగారు. ఇక ప్రభుత్వ అధినేత అయ్యాక కూడా ఈ ధోరణి మారలేదు. భారత్ తో ఎప్పుడు ఘర్షణకు దిగుదామా? అని ఆలోచిస్తున్నట్లుంది. భారత్ లో ఆశ్రయం పొందుతున్న బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలని తరచూ డిమాండ్లు చేస్తున్నారు. తాజాగా యూనస్ అసలు స్వరూపం బయటపడింది. మోమునుల్ హక్.. బంగ్లాదేశ్ కు చెందిన అతివాద సంస్థ హెఫాజత్–ఎ–ఇస్లాం నాయకుడు. భారత్ పై విషం కక్కే ఇతడితో యూనస్ సమావేశం అయ్యారు. రెచ్చగొట్టేలా ప్రసంగిస్తూ భారత్ ను ద్వేషించే మోమునుల్ తో ఏకంగా యూనస్ ఏకంగా బంగ్లాదేశ్ లో ఎన్నికల గురించి చర్చించడం గమనార్హం. జైలు నుంచి బయటకు తెచ్చి.. మోమునుల్ హక్.. హింస సహా అతివాద చేష్టలతో అతడిని షేక్ హసీనా సర్కారు జైలులో వేసింది. అయితే, హసీనా దిగిపోయాక వచ్చిన యూనస్ ప్రభుత్వం మోమునుల్ ను విడుదల చేసింది. ఇప్పుడు అతడితో మరికొందరు భారత వ్యతిరేకులతోనూ యూనుస్ భేటీ అయ్యారు. దేశంలో ఎన్నికల సంస్కరణలు, తాజాగా ఎన్నికల నిర్వహణను చర్చించారని సమాచారం. ఇకపోతే.. బంగ్లాదేశ్ లో మూడో పెద్ద పార్టీ జమాతే ఇస్లామీ. పూర్తి మతతత్వ పార్టీ. దీనినీ హసీనా సర్కారు బ్యాన్ చేసింది. యూనస్ సర్కారు ఆ నిషేధాన్ని ఎత్తివేసింది. దీన్నిబట్టే భారత్ పై యూనస్ వైఖరి ఏమిటో తెలిసిపోతోంది. పైకి మాత్రం జమాతే ఇస్లామీ అధినేత షఫీకుర్ రహమాన్ భారత్ తో స్నేహం కోరుకుంటున్నామని చెప్పాడు. అతలోనే సంబంధాల పేరిట తమ దేశ అంతర్గత అంశాల్లో జోక్యం చేసుకోవద్దని భారత్ ను హెచ్చరించాడు. దీంతోపాటు హసీనాను ఎప్పుడు అప్పగిస్తున్నారో చెప్పాలంటూ ఇప్పటికే భారత్ ను బంగ్లాదేశ్ డిమాండ్ చేస్తోంది.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేర్చడంలో మీడియా పాత్ర కీలకం : ఎంపీ ఈటల రాజేందర్

### ప్రభుత్వ సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో పిఐబి ప్రముఖ పాత్ర- జిల్లా పాలనాధికారి గౌతమ్ పోట్రు







జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడవాడ) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తోన్న ప్రజా సంక్షేమ పథకాలు అట్టడుగు స్థాయిలో ఉన్న వారికి కూడా చేరేలా చూడాల్సిన బాధ్యత అధికారులదే... ఆ సంక్షేమ పథకాలు లబ్దిదారులకు చేరాయా లేదా అని నిర్ధారించుకొని వార్తలు రాయాల్సిన బాధ్యత మాత్రం పాత్రికేయులదేనని మల్కాజ్ గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టరేట్ లో పత్రికా సమాచార కార్యాలయం ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఏర్పాటు చేసిన వార్తలాప్ – వర్క్ షాప్ లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన సమగ్ర సమాచారం మీడియా ద్వారా ప్రజలకు చేరవేయడంలో పత్రికా సమాచార కార్యాలయం (పిఐబి) ప్రముఖ పాత్ర పోషిస్తోందని ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఐబి లాంటి కేంద్ర ప్రభుత్వ కార్యాలయం నేడు మన మధ్యకు వచ్చి జిల్లా స్థాయిలో వర్క్ షాప్‌లను నిర్వహిస్తోందని ఇందుకు పిఐబి బృందాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు.. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏ విధంగా అమలు అవుతున్నాయో దానికి సంబంధించిన ఫీడ్బాక్ అందించాల్సిన బాధ్యత పాత్రికేయులదేనని పాలనాధికారి అన్నారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఆధీనంలోని పత్రికా సమాచార కార్యాలయం ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తోందని, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని ప్రజలకు, మీడియా కు చేరవేయడంలో పత్రికా సమాచార కార్యాలయం ముఖ్య పాత్ర పోషిస్తోందని తెలంగాణ రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీమతి శృతి పాటిల్ తన స్వాగతోపన్యాసం లో తెలిపారు. జర్నలిస్టులు నైతిక విలువలు పాటిస్తూ, కచ్చితమైన వార్తలను సేకరించి ప్రజలకు మరిన్ని మంచి వార్తలు అందేలా చూడాలని, మనం వార్తలు రాసే ముందు నిర్ధారణ చేసుకోవడం చాలా ముఖ్యమని రచన జర్నలిజం కాలేజీ ప్రిన్సిపల్ ఉమా మహేశ్వర రావు అన్నారు. ఈ డిజిటల్ యుగంలో మారుతున్న కాలానికి అనుగుణంగా మనల్ని మనం నవీకరించుకుంటూ వార్తలు అందించాల్సిన అవసరం ఉందని అన్నారు. మీడియా లో విలువలు, అభివృద్ధి జర్నలిజం, అంశాలపై ఆయన మాట్లాడారు. కృత్రిమ మేధ(AI) రోజురోజుకు అభివృద్ధి చెందుతోంది.. ఇది మంచి పరిణామమే కావొచ్చు. అయితే ఈ సాంకేతికతను కొందరు వేరే వాటికి ఉపయోగిస్తుండడం కలవర పెడుతోంది.కేవలం ఫొటోలు, వీడియోలే కాదు వాయిస్‌ను కూడా ఫేక్ చేయవచ్చు. సాంకేతికతను సరైన విధంగా వాడుకోవాల్సిన సామాజిక బాధ్యత పౌరులుగా మనందరి పై ఉందని సతేంద్ర గుప్తా అన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రిరాజశేఖర్ రెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, పత్రికా సమాచార కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ డా. మానస్ కృష్ణ కాంత్ పిఐబి అధికారులు గాయత్రి, శివ చరణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పవిత్రమైన, పర్యావరణ పరిరక్షణకు ముఖ్యమైనవి మట్టి గణపతి

### గణేష్ విగ్రహాల పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరణ.





జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : వినాయక చవితి పండుగ ను పురస్కరించుకొని ఈ సంవత్సరం, పర్యావరణం పై అవగహన కల్పించేందుకు. మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్లను మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్, గౌతమ్ పొట్రు, IAS పోస్టర్లను ఆవిష్కరించారు. పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఎర్పాటు చేసుకోని పర్యావరణాని కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందని కలెక్టర్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాలలొ భాగాంగ 8 అంగుళాల మట్టి గణపతి లను అందించి పర్యావరణం పై పెద్ద ఎత్తున అహగహన కార్యక్రమాలు TGPCB నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అవగాహన కార్యక్రమాలలొ బాగంగా రాష్ట్ర వ్యాప్తం గా పర్యావరణ గణేష్ పోస్టర్ల ప్రదర్శన ఆటోట్రాలీ ల ద్వారా పర్యావరణ సందేశంలతో ప్రదర్శన, ప్రింట్ మరియు ఎలక్ట్రనిక్ మీడియా ద్వారా ప్రచార కార్యక్రమాలు చేపట్టేందుకు TGPCB సిద్దమౌతుంది. మట్టి గణపతి ద్వారా పర్యావరణ పరిరక్షణ పై పాఠశాలలో, కళాశాలల్లో క్విజ్ కార్యక్రమాలు నిర్వహించడం, చేతి వృత్తిల వారికి మట్టి విగ్రహలు తయారిపై శిక్షణ, ఆటోల వెనుక, పోస్టర్ల ప్రదర్శన, బస్టాప్ లలో హెర్డింగ్ లు మట్టి గణేష్ ల ద్వారా పర్యావరణ పరిరక్షణ పై కళాజాత కూడ నిర్వహించడం జరుగుతోంది. చెరువుల్లో మట్టి మేటలని తొలిగించటానికి చెరువులో స్వచ్ఛత కాపాడటానికి వినాయక చవితి సందర్భంగా ప్రజలు భక్తులు నడుము బిగించాలాని మట్టి తో వినాయక విగ్రహాలు తాయారు చేసి భక్తితో చెరువులోకి చేర్చొచ్చని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చైతన్యవంతం చేసే ప్రయత్నం చేసారు. ఈ కార్యక్రమంలో TGPCB, ప్రాంతీయ కార్యాలయం, మేడ్చల్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ B.రాజేందర్ గారి సూచనల మేరకు వారి ఆఫీసు సిబ్బంది జి. లింగయ్య AES తదితరులు పాల్గొన్నారు.

# ర్యాగింగ్ రహిత కళాశాలలుగా గొప్ప పేరు గడించాలి : ఇన్స్పెక్టర్ శ్రీనాథ్

శామీర్ పేట, (గరుడ వార్త) : ర్యాగింగ్ రహిత విద్యాలయాలుగా వెలుగొందేందుకు విద్యార్థులు నడుంబించాలని, ర్యాగింగ్ కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని శామీర్ పేట పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రం శామీర్ పేట లోని ఎస్ పి ఆర్ జూనియర్, డిగ్రీ కళాశాలలో యాంటి ర్యాగింగ్, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ ఎవరైనా ర్యాగింగ్ కు పాల్పడితే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని,



ర్యాగింగ్ చట్టం కింద కేసులు నమోదైన విద్యార్థులు భవిషత్తులో ఎటువంటి ఉద్యోగానికి అర్హులు కాలేరని తెలిపారు. ర్యాగింగ్ కు పాల్పడిన విద్యార్థులపై నాన్బెయిలబుల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా ర్యాగింగ్ కు పాల్పడినట్లయితే కళాశాల యాజమాన్యందృష్టికి, పోలీస్ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లరాదని, ఎవరైనా మత్తు పదార్థాలు సేవిస్తే పోలీసుల దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. బాగా చదువుకోని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, సమాజానికి మంచి పేరు తెచ్చే పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నలుగురు గంజాయి స్మగ్లర్లను అరెస్ట్

### వారి వద్ద నుండి 243 కిలోల గంజాయి స్వాధీనం : మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి



శామీర్ పేట, (గరుడ వార్త) : గుట్టు చప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న గంజాయిస్ స్మగ్లర్లను బాలానగర్ ఎస్ఓటి పోలీసులు, శామీర్ పేట పోలీసులు సంయుక్తంగా వాహనాల తనిఖీల్లో అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించిన సంఘటన శామీర్ పేడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బుధవారం మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గంజాయి స్మగ్లర్స్ రకరకాల పద్దతులలో పోలీసుల కళ్లు కప్పి గంజాయిని తరలిస్తున్నారని తెలిపారు. శామీర్ పేట్ రింగ్ రోడ్డు మీద గంజాయిని తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు బాలానగర్ ఎస్ ఓ టి, శామీర్ పేట్ పోలీసులు సంయుక్తంగా గంజాయి ముఠా పై దాడి చెసి బొలేరో వాహనంలో పాత ఇంటి సామాను మాటున గంజాయిని తరలిస్తుండగా నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొన్నట్లు చెప్పారు. వారి వద్ద నుంచి 243 కేజీల ఎండు గంజాయి, బొలేరో వాహనం 7 సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ సుమారు రూ. 95 లక్షల 75 వేల వరకు ఉంటుందన్నారు. పోలీసుల విచారణలో వీరు గంజాయి ని ఒరిస్సా నుంచి హైదరాబాదు మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు గా గుర్తించారని చెప్పారు. గంజాయి తరలిస్తున్న బోయన్ పల్లి లో నివసిస్తున్న హర్యానాకు చెందిన బజరంగ్ (24) కార్గో ప్యాకర్స్, మూవర్స్ నిర్వహిస్తుండగా, న్యూ బోయిన్పల్లిలో నివాసముంటున్న రాజస్థాన్ కు చెందిన గజేందర్ సింగ్ అలియాస్ గజ్జు (26) సెవెన్ హిల్స్ ప్యాకర్స్, మూవర్స్, సెల్ ఫోన్ రిపేర్ షాప్ నిర్వహిస్తుండ గా, హర్యానాకు చెందిన నరేష్ చింగ్ల అలియాస్ నరేష్ (40) సెకండ్ హ్యాండ్ వాహనాల విక్రయదారుడు (ఒడిశా నుంచి గంజాయి కొనుగోలు కోసం ఫైనాన్సర్), అల్వాల్ ప్రాంతంలో నివాసముంటున్న హర్యానాకు చెందిన కపిల్ శర్మ (28) ఇంటర్నెట్ వ్యాపారం నిర్వాహకులను రిమాండ్ కు తరలించినట్లు చెప్పారు. గంజాయి కొనుగోలుదారు మహారాష్ట్రకు చెందిన రాకేష్, సరఫరా ఆధారుడు ఒడిస్సా రాష్ట్రానికి చెందిన సుభాష్ లు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరిని త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని డిసిపి కోటి రెడ్డి చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో సైబరాబాద్ ఎస్ఓటి డిసిపి శ్రీనివాస్, సైబరాబాద్ అడిషనల్ ఎస్ఓటి డిసిపి శోభన్ కుమార్, పేట్ బషీరాబాద్ ఏసిపి రాములు, శామీర్ పేట ఇన్స్పెక్టర్ శ్రీనాథ్, బాలానగర్ ఎస్ఓటి ఇన్స్పెక్టర్ శివకుమార్, పోలీస్ బృందాలు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఎంపీ, ఎమ్మెల్యే

శామీర్ పేట, (గరుడ వార్త) : పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్, స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డిలు లబ్ధిదారులకు పంపిణి చేశారు. బుధవారం శామీర్



పేట మండల పరిషత్ కార్యాలయంలో శామీర్ పేట మండలం, తూముకుంట మున్సిపల్ కు చెందిన. 186 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చేక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సహకార సంఘం చైర్మన్ మధుకర్ రెడ్డి, తూముకుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావు, మాజీ ఎంపీపీలు చంద్రశేఖర్ యాదవ్, ఎల్లు బాయి, మాజీ జెడ్పిటిసి అనిత, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటీసీ సభ్యులు, బిజెపి, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మేము సైతం!

కరీంనగర్ : ఒకప్పుడు ఇంటికో వాహనం అన్నట్లుగా ఉండేది. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ఇంటికి రెండు, మూడు వాహనాలు వచ్చి చేరుతున్నాయి. విద్య, ఉద్యోగ, ఉపాధి, వ్యాపార, కుటుంబ, అవసరాల నేపథ్యంలో మహిళలు కూడా వాహనాలపై దూసుకెళ్తున్నారు. ద్విచక్ర, కార్లు నేర్చుకునే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. నిత్యం రవాణాశాఖ కార్యాలయాలకు వెళ్లి లైసెన్స్‌లు తీసుకునే వారిలో మహిళలూ కనిపిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహిళల్లో పెరుగుతున్న డ్రైవింగ్ ఆసక్తిపై కథనం.

వాహనంనడపడం అవసరంగా...కుటుంబ పోషణ, అవసరాలు పెరగడం, ఒకప్పుడు ఇంటికే పరిమితమైన అతివలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. నచ్చిన రంగాన్ని ఎంచుకొని ముందుకు సాగుతున్నారు. తమ అవసరాలకు ఇతరులపై ఆధారపడకుండా స్వయంగావాహనాలు నడుపుతూ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. పిల్లలను పాఠశాలల్లో దింపడానికి తల్లులు, చదువుకునే విద్యార్థినులు, వైద్యులు, న్యాయవాదులు, ఇలా వేర్వేరు రంగాలకు చెందిన వారు వాహనాలను నడిపే వారి సంఖ్య పెరిగింది. అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి, ఇతర పనులకు బయటకు వెళ్లడానికి ఇతరులపై ఆధారపడకుండా వెళ్తున్నారు. ఒకప్పుడు హైదరాబాద్, ముంబయి, బెంగళూర్‌లాంటి పెద్ద నగరాల్లో మాత్రమే మహిళలు ద్విచక్ర, కార్లు నడిపేవారిని చూసేవారం. ప్రస్తుతం పల్లె వరకు మహిళలు చోదకం నేర్చుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో...కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో 2016 వరకు లైసెన్స్ పొందిన మహిళలు 3010 ఉన్నారు. ప్రస్తుతం 14,192 మంది ఉ



న్నారు. అత్యధికంగా కరీంనగర్ జిల్లాలో 6631 మంది ఉండగా, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1399 మహిళలు డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్నారు. పదేళ్ల క్రితం వందల్లో ఉన్న లైసెన్స్‌ల సంఖ్య ప్రస్తుతం వేలల్లో ఉంది. లైసెన్స్ తీసుకోవడానికి వచ్చే మహిళల సంఖ్య ఏటా పెరుగుతుందని ఆర్టీఏ అధికారులు అంటున్నారు. వీరిలో ఉద్యోగిణులు, విద్యార్థినులు అధికంగా ఉంటున్నారని పేర్కొన్నారు.

పరిస్థితులకు అనుగుణంగా..ప్రస్తుతం మారుతున్న పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా వాహనం నడపడం నేర్చుకున్నా. ఇతరులపై ఆధారపడకుండా స్వయంగా వాహనం నడుపుకొంటూ వెళ్లడానికి వీలుంటుంది. ఉద్యోగరీత్యా, మనం పని చేసే చోటకు సులువుగా చేరుకోవచ్చు.సమయమూ ఆదా అవుతుంది.డాక్టర్ హిందూ, కరీంనగర్

ఇతరులపై ఆధారపడకుండా..

ప్రస్తుత అవసరాల దృష్ట్యా వాహనం నడపడం రావడం తప్పనిసరి. ఎనిమిదేళ్ల క్రితం ద్విచక్రవాహనం నడపడం నేర్చుకున్నా. ఉద్యోగ రీత్యా కార్యాలయానికి రావడానికి, మార్కెట్‌కు వెళ్లడానికి, అత్యవసర సమయాల్లో బయటకు వెళ్లడానికి ఇది దోహదపడుతుంది. ఇతరులపై ఆధారపడకుండా వాహనం నడపడం నేర్చుకున్నా.

స్రవంతి, ఆర్టీసీ పొరుగు సేవల ఉద్యోగిని

రోజువారి పనుల్లో ఉపయోగంవాహనం నడపడం వస్తే మార్కెట్‌కు, ఇతర అవసరాలకు బయటకు వెళ్లడానికి ఉపయోగపడుతుంది. అదే ఆటోలో వెళ్తే ఖర్చు ఎక్కువ, సమయం వృథా అవుతుంది. ప్రస్తుతం ఉన్న జీవనకాలంలో మహిళలు కూడా ద్విచక్ర, కారు నడపడం నేర్చుకోవడం అవసరం. బి.సమత, గృహిణి

## చదివింది తక్కువే.. చదివేదే ఎక్కువ..!

మోత్కూరు : ఆయన చదువుకుంది ఆరో తరగతే. కానీ సేకరించిన పుస్తకాలు రెండువేలకు పైగా ఉన్నాయి. ఎక్కడకి వెళ్లినా పుస్తకాలు కొనడమే అతనికున్న అభిలాష. హైదరాబాద్, విజయవాడ లాంటి పట్టణాలకు వెళ్లాడంటే.. తన పనికన్నా ముందు విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయ తదితర బుక్‌స్టోర్‌లకు వెళ్లి తనకు నచ్చిన పుస్తకాలు కొనుక్కొన్న తర్వాతే తను వెళ్లిన పని చేసుకుంటారు. ఇంతగా పుస్తక పఠనం, సేకరణ అలవాటుగా చేసుకున్న ఆయనే చెరుకు అగ్గిరాములు. మోత్కూరు పురపాలిక పరిధిలోని కొండగడప గ్రామానికి చెందిన ఆయన ఏడుపదుల వయసులోనూ అనునిత్యం సమయం దొరికితే.. పుస్తకాలు చదువుతూ ఉంటారు. ఈ సందర్భంగా ఆయన తన అనుభవాలను పంచుకున్నారు.

రూ.10 ఫీజు కట్టలేక చదువు మానేసి..

నేను మోత్కూరులో ఆరో తరగతి వరకు చదువుకున్నాను. రూ.10 ఫీజు కట్టలేక చదువు మానేశాను. పేదరికంతో నాన్న నర్సయ్య నన్ను 1973లో చెన్నై పంపారు. అక్కడ రిక్షా తొక్కుతూ జీవనం గడిపాను. అప్పుడు పెద్దలు రామస్వామి పెరియార్, అన్నాదొరై, ఎంజీఆర్ లాంటి వారి సభలకు వెళ్లి వారి ప్రసంగాల ద్వారా ప్రభావితం చెందాను. కమ్యూనిజం అంటే ఎంతో అభిమానం. చెన్నైలో ఉన్నప్పుడే విశాలాంధ్ర పత్రికను విజయవాడ నుంచి పోస్టులో తెప్పించుకుని చదివేవాడిని. మొదట్లో యక్షగానాలు, కీర్తనల పుస్తకాలు.. ఆ తరువాత కమ్యూనిస్టు ఉద్యమాలు, ఉద్యమ నాయకులు కె.కృష్ణమూర్తి, పుచ్చపల్లి సుందరయ్య, చంద్ర రాజేశ్వర్‌రావు, భీంరెడ్డి నర్సింహారెడ్డి, రవి నారాయణరెడ్డి, కేఆర్, ఏఆర్ ఇలా.. నాయకులు రాసిన అనేక పుస్తకాలు, వారి జీవిత చరిత్రలు చదివాను. నవలలు చదివే అలవాటు ఉంది. కమ్యూనిస్టు సభలకు, ఎక్కడకు వెళ్లినా ఇష్టమైన పుస్తకాలు కొనుక్కోవడం అలవాటు. ఏటా హైదరాబాద్‌లో నిర్వహించే పుస్తక ప్రదర్శనకు వెళ్లి కొన్నింటిని తెచ్చుకుంటాను. వాటిని కొనడమే కాదు. తగిన విధంగా అట్టలు వేయడం, బైండింగ్ చేయడంతో పాటు భద్రంగా దాచిపెడతాను. ఇంట్లో బీరువాలో, ట్రంకు పెట్టెల్లో దాచిపెట్టాను. నా కొడుకు పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం చేస్తున్నాడు. నన్ను చూసి అతను కూడా పుస్తకాల సేకరణకు ప్రాధాన్యం ఇస్తున్నాడు.

# అప్పుల కుప్ప.. బకాయిల బండ



హైదరాబాద్: గ్రేటర్‌లో అత్యవసర పనులు తప్ప కొద్ది నెలలుగా ఇతర అభివృద్ధి జరగట్లేదు. కాలనీ రోడ్లు, నాలాలు, పార్కులు, శ్మశానవాటికల అభివృద్ధి, మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్ల నిర్మాణం ఇలా చాలా పనులు అటకెక్కాయి. కొన్ని మధ్యలోనే నిలిచిపోయాయి. నాలాల పూడికతీత, నిర్మాణ పనులు సవ్యంగా జరగకపోవడంతో వర్షాకాలం ముంపు తిప్పలు తప్పడం లేదు. జీహెచ్‌ఎంసీకి సర్కారు నుంచి వేర్వేరు రూపాల్లో రూ.8వేల కోట్లు రావాలి.

చిన్నపాటి పనులకూ ఇబ్బందే

జీహెచ్‌ఎంసీలో 150 మంది కార్పొరేటర్లతో పాలకమండలి, 15 మంది కార్పొరేటర్లతో ఏర్పాటయ్యే స్థాయీ సంఘం ఉంటాయి. స్థాయీ సంఘం వారానికోసారి సమావేశమై రూ.4కోట్ల విలువైన అభివృద్ధి, నిర్వహణ పనులను ఆమోదిస్తుంది. వాటిని ప్రతి మూణ్నెళ్లకోసారి పాలకమండలి సమావేశం ఆమోదిస్తుంది. 2024 ప్రారంభం నుంచి స్థాయీ సంఘం సమావేశాలు సరిగా జరగట్లేదు. మూడు నెలలు, రెండు నెలల వ్యవధితో జరుగుతున్నాయి.

బడ్జెట్‌లో కేటాయింపులు.. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి తాత్కాలిక పద్దులో జీహెచ్‌ఎంసీకి రూ.1100కోట్లు ప్రకటించింది. జులై 26న పూర్తిస్థాయి పద్దులో మరో రూ.3065 కోట్లు కేటాయించింది. అందులో రూ.250కోట్లే ఇప్పటివరకు బల్దియాకు అందాయి.

వాయిదాలే సవాలు

వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్సార్డీపీ), వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఎన్‌డీపీ), జేఎన్ఎన్‌యూఆర్‌ఎం పథకం, ప్రధాన రోడ్లను ప్రైవేటు సంస్థలకు అప్పగించిన సీఆర్ఎంపీ (సమగ్ర రహదారుల నిర్వహణ) పథకాలకు జీహెచ్‌ఎంసీ రూ.6 వేల కోట్లకు పైగా అప్పులు చేసింది. ఈ రుణ వాయిదాలను చెల్లించడం బల్దియాకు సవాల్‌గా మారింది.

విడుదల కాని నిధులు

ఆస్తిపన్ను, ఇతర బకాయిలు విడుదల చేయకపోవడం, ఆస్తిపన్ను మాఫీతో జీహెచ్‌ఎంసీపై ఏటా పడుతున్న రూ.600కోట్ల భారం భర్తీ చేయకపోవడం, వేర్వేరు సంస్థలకు చెల్లించిన నిధులు తిరిగి రాకపోవడమే ప్రస్తుత పరిస్థితికి ప్రధాన కారణం.

ఋణాలు ఇలా (రూ.కోట్లలో)..

జేఎన్ఎన్‌యూఆర్‌ఎం: 140

ఎస్సార్డీపీ: 4,250

సీఆర్ఎంపీ: 1,304.48

ఎస్ఎన్‌డీపీ: 680

మొత్తం: 6,374.48

# ఉపాధ్యాయుల సర్దుబాటు



కరీంనగర్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనకు కొరత తీర్చేందుకు ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను విద్యాశాఖ పూర్తి చేసింది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండి ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్న బడుల నుంచి వారిని అవసరమైన పాఠశాలలకు సర్దుబాటు చేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది.

145 మంది...జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలతోపాటు కొన్ని ఉన్నత పాఠశాలల్లో అదనంగా నిలుస్తున్న మొత్తం 145 మంది ఉపాధ్యాయులను బోధనకు కొరత ఏర్పడిన చోట్ల, విద్యార్థుల సంఖ్యకు ఆధారంగా పంపించారు. చాలా ఏళ్ల తర్వాత పదోన్నతులు, బదిలీలను చేపట్టడంతో జిల్లాలో 488 మంది ఉపాధ్యాయులు బదిలీలు అయ్యారు. 482 మందికి పదోన్నతులు లభించాయి. చాలామంది ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించడంతో ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. ఫలితంగా కొన్ని పాఠశాలల్లో బదిలీ అయినా రిలీవ్ కాని పరిస్థితి. పదోన్నతులతో ఎస్జీటీ ఖాళీలు ఏర్పడటం, ఆ క్రమంలోనే బదిలీలు జరగడంతో ఎస్జీటీలుగా పనిచేస్తున్న వారికి అనుకూలమైన చోటుకు స్థానచలనం అయ్యే ఆస్కారం ఏర్పడింది. దీంతో జిల్లా, మండల కేంద్రాలకు దూరంగా, బస్సు సౌకర్యం లేని పాఠశాలల వైపు అనాసక్తి చూపారు. తాజాగా ఉపాధ్యాయుల కొరతను ఎదుర్కొంటున్న పాఠశాలలకు పలువురిని కేటాయించడం కొంత ఊరట కలిగిస్తున్నా.. పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తూనే ఉండటం గమనార్హం.

వారికి ఉండదా?

ఎయిడెడ్ పాఠశాలలు మూతపడి ఎంఈవో పరిధిలో ఉంటున్న ఉపాధ్యాయుల్లో కొందరిని సర్దుబాటుపై ప్రభుత్వ పాఠశాలలకు కేటాయించినా.. అధికారులు కొద్ది మందిని మాత్రం ఏళ్లుగా ఒకే పాఠశాలకు పరిమితం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఉపాధ్యాయులు అక్కడే పాతుకుపోతున్నారని, మిగిలిన వారిని మాత్రం ఏటా సర్దుబాటు పేరుతో తిప్పుతున్నారనే చర్చ ఉపాధ్యాయుల్లో సాగుతోంది. డీఈవో జారీ చేసిన ఉత్తర్వుల్లోని క్యాడర్ పోస్టుకు భిన్నంగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సర్దుబాటు ప్రక్రియలో నగరంలోని ఒకటి రెండు ప్రభుత్వ పాఠశాలల్లో అదనంగా ఉపాధ్యాయులున్నా వారిని వదిలేశారనే చెబుతున్నారు. రెండు, మూడు నెలల్లో ఉద్యోగ విరమణ పొందబోయే ఉపాధ్యాయులను సైతం సర్దుబాటు పేరుతో మరో పాఠశాలకు పంపడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

# కరెంట్‌తో.. జర పైలం బిడ్డో..!



నాంపల్లి : ఉమ్మడి నల్గొండ జిల్లాలో గత రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు, గృహ వినియోగదారులు విద్యుత్తు పరికరాలకు దూరంగా ఉండటం మంచిది. వానలకు నేల తడిసిపోయి, గాలి తాకిడికి విద్యుత్తు తీగలు తెగిపడి ప్రమాదానికి ఆస్కారం అధికంగా ఉంటుంది. అప్రమత్తంగా ఉంటే విద్యుత్తు ప్రమాదాలు నిరోధించే అవకాశం ఉంది.

స్తంభాలతో జాగ్రత్త..

వానాకాలంలో కొన్నిచోట్ల విద్యుత్తు స్తంభాలకు కూడా కరెంటు ప్రవహిస్తుంది. పట్టణాలు, గ్రామాల్లో, వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసిన స్తంభాలకు దూరంగా ఉండాలి. చిన్న పిల్లలను వీటి వద్దకు వెళ్లనీయొద్దు. ఇళ్లల్లోనూ తడి చేతులతో స్విచ్‌లు వేయవద్దు. తడి గోడలను తాకొద్దు. ఉతికిన దుస్తులు ఆరేసేందుకు మహిళలు ఇంట్లో తీగలు ఏర్పాటు చేసుకుంటారు. ఇవి విద్యుత్తు వైర్లకు తాకకుండా చర్యలు తీసుకోవాలి. సాధ్యమైనంత వరకు ఆరవేసేందుకు ప్లాస్టిక్‌తో తయారు చేసిన తాడు వాటటం మేలు. డాబాపై నుంచి హైటెన్షన్ వైర్లు ఉన్నట్లయితే వర్షం కురుస్తున్నప్పుడు పైకి వెళ్లకపోవడం మంచిది.

అధికారులకు సమాచారమివ్వాలి..

జోరు గాలి వానకు చాలాచోట్ల విద్యుత్తు తీగలు తెగిపోవడం, నియంత్రికల్లో మంటలు రావడం, స్తంభాలు విరగడం, చెట్లు విరిగి తీగలపై పడటం చూస్తుంటాం. ఇలాంటి సందర్భాల్లో కొన్ని చోట్ల రైతులే మరమ్మతులు చేస్తుంటారు. ఇలా చేయడం అత్యంత ప్రమాదకరం. ఈ క్రమంలో వెంటనే విద్యుత్తు అధికారులకు సమాచారం ఇవ్వాలి. వర్షాల నేపథ్యంలో గృహాల్లో కరెంటు పరికరాలకు దూరం పాటిస్తూ ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

నియంత్రికలకు దూరం ఉత్తమం..


ఈ సమయంలో విద్యుత్తు నియంత్రికలకు చాలా దూరంగా ఉండటం ఉత్తమం. కొన్నిచోట్ల వాటికి చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయలేదు. దీంతో వాటి పక్క నుంచి నడిచినా విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉంది. చాలాచోట్ల పశువులు ఇలాంటి నియంత్రికల వద్దే మృత్యువాత పడుతున్నాయి. ఈదురుగాలులు వీచినప్పుడు కూడా తీగలు తెగిపోయి మీద పడవచ్చు.

వ్యవసాయ బోరు మోటార్ల వద్ద..

వ్యవసాయ క్షేత్రాల్లో బోరు మోటార్లు ఆన్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. మోటారుకు ప్లాస్టిక్ స్టార్టర్ డబ్బాలను.. సురక్షిత ప్రాంతాల్లో అమర్చుకోవాలి. డబ్బా దగ్గరకు వెళ్లినప్పుడు కాళ్లకు చెప్పులు, చేతికి తొడుగులు ధరించాలి. స్టార్టర్ డబ్బాల్లో ఎలుకలు, పాములు నివసిస్తుంటాయి. ఇవి విద్యుత్తు తీగలను కొరికేయడంతో తీగలు తేలి ఉంటాయి. అన్ని తీగలు, ఫ్యూజ్‌లను నెలకోసారి పరిశీలించాలి. తెగిపోయి వేలాడే తీగలను ముందే గుర్తించాలి. మరమ్మతులు చేయాల్సి వస్తే వెంటనే సంబంధిత వ్యక్తులకు చూపించాలే తప్ప సొంతంగా చేయకూడదు.

# ఉల్లంఘనులు

ఆసిఫాబాద్: కంకర, క్రషర్, తెల్లసుద్ద క్వారీల్లో ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో ఈటీఎస్(ఎలక్ట్రానిక్ టోటల్ సిస్టమ్) సర్వే కొనసాగుతోంది. లీజుకు తీసుకున్న భూమి కంటే అదనంగా ఆక్రమించి తవ్వడం, పర్మిట్లు తీసుకోకున్నా కంకరను తరలించడం, క్వారీలను తవ్వడంతో నిబంధనలు పాటించకపోవడం వంటి అంశాలు అధికారుల సర్వేల్లో వెలుగు చూస్తున్నాయి. నిర్ణీత భూమి కంటే అదనంగా తవ్వారనే కారణంతో జైనూర్ మండలం ఉషేగాం గ్రామ సమీపంలోని క్వారీ యజమాని డోక్రే సుభాష్‌కు అధికారులు రూ.1.36 కోట్ల జరిమానా విధించారు. ఈ సొమ్ము చెల్లించడానికి మూడు నెలల గడువు ఇచ్చారు. జిల్లాలో తెల్లసుద్ద 7, కంకర క్వారీలు 8, క్రషర్‌లు 8 ఉన్నాయి. క్వారీలు నాలుగైదు హెక్టార్ల విస్తీర్ణంలో ఉండగా, తెల్లసుద్ద క్వారీలు 200 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. నిర్దేశిత భూమి పరిధిలోని క్వారీల్లో తవ్వకాలు చేపట్టాలి. అందుకు భిన్నంగా పక్కనున్న భూములను కలుపుకొని తవ్వేస్తున్నారు. జిల్లాలో నాలుగు వరుసల రహదారికి అవసరమయ్యే కంకరను కౌటాల మండలం ముత్యంపేట క్వారీల నుంచి తీసుకొచ్చారు. ఇక్కడ తనిఖీలు పూర్తయితే రూ.కోట్లలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాశముంది.



ఒక్కరే సర్వేయర్..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు క్వారీలకు సంబంధించి ఒక్కరే సర్వేయర్ ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎంత మేరకు తవ్వుతున్నారో తెలియకుండా పోతుంది. ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి సర్వే చేస్తే క్వారీలు తవ్వకాలు సక్రమంగా ఉంటాయి. వర్షాలు వస్తున్నాయనే సమాచారంతో క్వారీల యజమానులు ముందస్తుగా అంటే ఒక నెల ముందుగా భారీగా తవ్వకాలు చేపట్టి, రాళ్లను వెలికితీసి కంకరగా మార్చుతున్నారు. ప్రస్తుతం అన్ని క్రషర్‌ల వద్ద గుట్టలుగా కంకర నిల్వ చేశారు. ఎంత తవ్వారు, ఎంత రాయల్టీ చెల్లించారో ఈ కంకరను చూసిన సులువుగా తెలుసుకోవచ్చనే గనులశాఖ అధికారులు చెబుతున్నారు.

త్వరలో నివేదికలు వస్తాయి – గంగాధర్, జిల్లా గనులశాఖ అధికారి జైనూర్ మండలంలో ఏటీఎస్ సర్వే పూర్తయింది. మిగతా చోట్ల కొనసాగుతుంది. నాలుగైదు రోజుల్లో ఈ సర్వే సైతం పూర్తవుతుంది. అక్రమంగా తవ్వారని తేలితే తప్పకుండా జరిమానా విధించి వసూలు చేస్తాం.

అటవీ ప్రాంతాల్లో..వాంకిడి మండలం డోంగరగావ్ కొండపై క్వారీ ఏర్పాటు చేశారు. ఈ కంకరను సైతం నాలుగు వరుసల రహదారికే వినియోగించారు. పూర్తి అటవీ ప్రాంతంలో క్వారీకి ఎలా భూములు అప్పగించారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్వారీ ఏర్పాటులో భూములు కోల్పోయిన రైతులకు కనీస పరిహారం సైతం ఇవ్వలేదు. ఈ క్వారీ ప్రస్తుతం మూతపడినా.. ఇక్కడ తనిఖీలు పూర్తయితే తరలించిన కంకరకు సంబంధించి భారీ స్థాయిలో గుత్తేదారుకు జరిమానా విధించనున్నారు.

రెబ్బెన మండలం రాళ్లపేట శివారు ప్రాంతం, కాగజ్‌నగర్ క్రాస్‌రోడ్‌ను ఆనుకుని తెల్లసుద్ద క్వారీలు ఉన్నాయి. ఏ గుత్తేదారు ఎంత తవ్వుతున్నారో, ఎంత తరలిస్తున్నారో, రాయల్టీ ఎంత చెల్లిస్తున్నారో లెక్కలేకుండా పోయింది. వాంకిడి మండలం నవేగాం క్వారీ గడువు ముగిసినా రాత్రుల్లో రాళ్లను క్రషర్‌కు తరలిస్తున్నట్లు సమాచారం.

# మద్య నిషేధానికి శతాబ్ది

భైంసా : తానూరు మండలం ఝరి గ్రామంలో 2013లో మద్యనిషేధం అమలు చేశారు. కల్లు దుకాణాన్ని మూయించారు. మద్యం విక్రయాలను సైతం నిషేధించారు. ఆబ్కారీ అధికారులను వేడుకుని గ్రామంలో కల్లు గీత, విక్రయాలను నిలిపివేయించారు. దీంతో గ్రామంలో గొడవలు తగ్గాయని, చాలా మంది వ్యవసాయ కూలీలు రైతులుగా మారారని స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఊరంతా ఐక్యంగా గ్రామంలో మొన్నటి కరోనా కాలం వరకు సామూహిక వివాహాలు జరిపించారు. పేద, మధ్యతరగతి తేడా లేకుండా కులాలకతీతంగా ఎవరి ఇంట పెళ్లి కుదిరినా, గ్రామస్థులంతా ఒక ముహూర్తం ఖరారు చేసే వరకు ఆగాల్సిందే. దీంతో పెళ్లి ఖర్చులు ఆదా అయ్యాయి. గ్రామంలో విద్యార్థులను ప్రోత్సహించేందుకు బహుమతులు అందిస్తున్నారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఒకే విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఐక్యతను చాటుతున్నారు. ఊళ్లో ఆధ్యాత్మిక చింతన అలవడింది. అందరూ సన్మార్గాల్లో నడుచుకోవడంతో ఊరు ఆదర్శంగా నిలుస్తోంది. స్థానికులు జిల్లా అధికారుల ప్రశంసలు



అందుకుంటున్నారు. ఐక్యంగా అమలు చేశాం – తవ్వల్‌వాడ్ అవదూత్, ఝరి(బి)అంతా ఐక్యంగా ఉండి మద్యం నిషేధానిక్షి కట్టుబడ్డాం. తొలుత ఇబ్బందులు పడ్డాం. కల్లు, మద్యం విక్రేతలు సమస్యలు సృష్టించారు. కానీ వాటిని సమష్టిగా ఎదుర్కొన్నాం. గ్రామస్థుల జీవితాలు మెరుగయ్యాయి. అభివృద్ధిలో అందరూ భాగస్వాములవుతున్నారు.మద్యం మానేయడంతో వ్యవసాయం చేస్తున్నా – దాసర్‌వాడ్ లక్ష్మణ్ తాగుడు అలవాటుతో పనులు చేయక కూలీగా మారాను. ఇక్కడ ఎవరూ పని ఇవ్వక పోవడంతో వలస వెళ్లి పాలేరుగా పని చేశాను. అక్కడ కూడా మానలేక పోయాను. కుటుంబ పోషణ భారమై మళ్లీ సొంతూరు వచ్చాను. ఇక్కడ కల్లు, మద్యం నిషేధించడంతో దొరకక మానేశాను. దీంతో కూలీపని మానేసి మళ్లీ సొంతంగా వ్యవసాయం చేస్తున్నాను. పిల్లల వివాహాలు చేశాం. నాలాంటి ఎన్నో కుటుంబాలు బాగుపడ్డాయి.

# కుండతో పోసినట్లు..!

నల్గొండ : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలు నీటమునిగాయి. వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. చాలా చెరువులు అలుగు పోస్తుండగా.. మరికొన్ని కట్టలు తెగి రహదారులపై ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి.చాలా ప్రాంతాలకు రాకపోకలు స్తంభించాయి. ప్రధానంగా కోదాడ పట్టణంలో వరద ఉద్ధృతికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరదలో కొట్టుకుపోయి ఇద్దరు మృతిచెందగా.. నిడమనూరు సమీపంలో ఎడమ కాల్వలో ఒకరు మరణించారు. వర్షాలతో రైలుపట్టాలు దెబ్బతినడంతో వరంగల్ – ఖాజీపేట మార్గంలో వెళ్లాల్సిన రైళ్లను మిర్యాలగూడ మీదుగా గుంటూరు, విజయవాడకు దారి మళ్లించారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని అడ్డగూడూరు, తుంగతుర్తి, మోత్కూరు, నూతన్‌కల్ మండలాల్లోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చాలా చెరువులు అలుగుపోస్తున్నాయి. నూతన్‌కల్‌లో ముత్యాలమ్మ కట్టతెగడంతో వరదకు ఇళ్లలోకి నీళ్లు చేరాయి. మద్దిరాల మండలం జాతీయ రహదారి 365పై నుంచి వరద ప్రవహిస్తుండటంతో రాకపోకలు బంద్ అయ్యాయి. నూతన్‌కల్‌లో వరద ప్రవాహం ఎక్కువగా ఉండటడంతో సూర్యాపేట – దంతాలపల్లి ప్రధాన రహదారిపై వరదలోనే బస్సులు రాకపోకలు సాగించాయి. అర్వపల్లి మండలంలోని కేజీబీవీలో జలదిగ్బంధంలో చిక్కుకుంది. నడుములోతు వరద నీరు చేరడంతో విద్యార్థులను స్థానికులు బయటకు తీసుకువచ్చారు. తాత్కాలికంగా సమీపంలోని ఫంక్షన్‌హాల్‌లో బస కల్పించి విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించి ఇళ్లకు పంపించారు. సూర్యాపేట పట్టణంలోని మానసనగర్, జాకీర్‌హుస్సేన్ నగర్, తిరుమల్‌నగర్‌తో పాటూ పలు రహదారులపై వరద నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. సూర్యాపేట మండలం పిల్లలమర్రి, పిన్నాయిపాలెం వద్ద మూసీ ఎడమ కాల్వకు గండిపడటంతో భారీ విస్తీర్ణంలో పంట పొలాలు నీటమునిగాయి.

మిర్యాలగూడలోని షాబూనగర్, రాంనగర్‌లలో ఇళ్లలోకి వరద నీరు చేరింది. ఎమ్మెల్యే బీఎల్ఆర్, అధికారులు పరిస్థితిని సమీక్షించారు.



మిర్యాలగూడ – సూర్యాపేట మార్గంలో భీమారం వద్ద వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి.

హుజూర్‌నగర్ మండల వ్యాప్తంగా కురిసిన భారీ వర్షానికి పలు చెరువుల కట్టలు తెగిపోయాయి. బూరుగుగడ్డ, గోపాలపురం చెరువులు తెగిపోవడంతో దిగువన ఉన్న పంట పొలాలు మునిగిపోయాయి. మేళ్లచెరువు మండలం నాగుల చెరువుకు గండి పడటంతో ఇళ్లలోకి నీళ్లు చేరింది. మూసీలో ప్రవాహం మహోగ్రంగా ఉంది. వలిగొండ మండలం బొల్లెపల్లి లోలెవల్ బ్రిడ్జి వద్ద నీటి మట్టం పెరగడంతో సంగం – బొల్లేపల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రుద్రవెల్లి వద్ద నీటి ప్రవాహం పెరగడడంతో బీబీనగర్ – పోచంపల్లి మధ్య రాకపోకలు స్తంభించాయి. నేరేడుచర్ల మండలం చిల్లెకల్లు బ్రిడ్జి వద్ద మూసీ జోరుగా ప్రవహిస్తోంది. పాలకవీడు మండలంలోని మహంఖాళీగూడెం వద్ద పుష్కర ఘాట్లు నీటమునిగాయి. మోతే మండలం ఉర్లుగొండ వద్ద రాత్రి చేపల చెరువు కాపలాకు వెళ్లిన వ్యక్తి వరద నీటిలో కొట్టుకుపోతుండటంతో స్థానికులు కాపాడారు. ఎగువన భారీ వర్షాలు కురవడంతో దుందుభి వాగులోకి భారీ వరద వస్తోంది. డిండి జలాశయంలోకి చేరుతుండటంతో ప్రాజెక్టు నిండుకుండగా మారింది. యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం దేవోజీనాయక్ తండా వద్ద కొండపోచమ్మ కాలువకు గండి పడటంతో పంట పొలాలు నీటమునిగాయి. డిండి కాలువ పొంగిపొర్లడంతో చందంపేట మండలం మూర్పునూతల వద్ద నాగర్‌కర్నూల్ జిల్లాకు వెళ్లే రహదారిని పోలీసులు మూసివేశారు.నార్కట్‌పల్లి, నకిరేకల్ మండలాల్లోని లోతట్టు ప్రాంతాలను కలెక్టరు నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నడిగూడెం మండలం సిరిపురం వద్ద ముంపు ప్రాంతాలను సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ బైక్‌పై తిరిగి పరిశీలించారు. యాదాద్రి జిల్లా మోటకొండూరు కొండాపురంలోని చెరువును కలెక్టరు హనుమంత్ కే.జెండగే పరిశీలించి సూచనలు చేశారు.

## అంగన్‌వాడీ.. ఇక బలపడి

ఆసిఫాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. కొన్ని నెలల క్రితం మినీ అంగన్‌వాడీలను ప్రధాన కేంద్రాలుగా ఉన్నతీకరించి వాటిలో పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభించింది. తాజాగా రాష్ట్రంలో 11వేల అంగన్‌వాడీల పోస్టులు భర్తీ చేస్తామని రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రకటన చేయడంతో మహిళ నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి.అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అయిదేళ్లలోపు చిన్నారు లకు పౌష్టికాహారంతో పాటు పూర్వ ప్రాథమిక విద్య, గర్భిణి, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్నారు. కాగా అంగన్‌వాడీ కేంద్రాలు ఖాళీలతో సతమతమవుతున్నాయి. ఒక్కో టీచర్ రెండు మూడు కేంద్రాలకు ఇన్‌ఛార్జులుగా ఉండటంతో నిర్వహణ గాడి తప్పుతోంది. సిబ్బంది కొరతతో కొన్ని కేంద్రాలు మూతబడటంతో చిన్నారులు చదువులకు దూరమవుతున్నారు. ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఆసిఫాబాద్ మండలం మందపెల్లి అంగన్‌వాడీ కేంద్రం. ఇక్కడ మొత్తం 15 మంది పిల్లలు, గర్భిణులు పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ కేంద్రానికి టీచర్, ఆయా లేరు. కొంత దూరంలో ఉన్న ఎర్రగుట్ట అంగన్‌వాడీ కేంద్రానిది ఇదే పరిస్థితి. ఈ రెండు కేంద్రాలకు వట్టివాగు కాలనీ అంగన్‌వాడీ కేంద్రం టీచరే ఇన్‌ఛార్జిగా ఉన్నారు. మండలంలోని యాపల్‌పాటి, చెందుగూడ అంగన్‌వాడీ కేంద్రాలకు పాడిబండ అంగన్‌వాడీ కేంద్రం టీచరే ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు.ఈ చిత్రంలో కనిపిస్తున్నది తిర్యాణి మండలం ఇర్కపల్లి అంగన్‌వాడీ కేంద్రం టీచర్. ఇక్కడ గర్భిణులు, బాలింతలు, పిల్లలు 39 మంది ఉన్నారు. ఆయా లేకపోవడంతో టీచరే అంతా చేసుకోవాల్సి వస్తుంది. ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చాలా వరకు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వెనుకబడిన జిల్లా నేపథ్యంలో త్వరగా ఇక్కడ పోస్టులు భర్తీ విషయంపై ఇటీవల ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కను.. కలెక్టర్ కోరారు. జిల్లా ప్రాతిపదికనే పోస్టులు భర్తీ చేస్తుండడంతో కొత్త వారికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. భర్తీపై ప్రభుత్వ ఆదేశాల కోసం వేచి చూస్తున్నాం.

# పప్పు బెల్లంలా పరిహారం



హైదరాబాద్ : అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నా..అవినీతికి మాత్రం కొంతమంది తగ్గడం లేదు. హైదరాబాద్ సమీపంలోని కొత్తూరు మండలం సిద్ధాపూర్ పారిశ్రామికవాడ నిర్మాణంలో భూసేకరణలో అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. పారిశ్రామికవాడ ఏర్పాటుకు సేకరించిన అసైన్డ్‌భూ ములు, ఆ భూముల్లో ఉంటున్న అసైనీలకు ఇవ్వాల్సిన నష్టపరిహారం కంటే రూ. 8కోట్లు ఎక్కువగా ఇచ్చారని రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారులు నిర్వహించిన అంతర్గత విచారణలో తేలింది.

ఇదీ వాస్తవం: 160మందికి మాత్రమే పరిహారం ఇవ్వాల్సి ఉండగా... 240 మందికి ఇచ్చారని రికార్డుల్లో ఉంది. అదనంగా పరిహారం పొందిన వారిలో కొందరి పేర్లను రెవెన్యూ అధికారులు, రాజకీయ నాయకులు జాబితాలో చేర్పించి, పరిహారం రాగానే స్వాహా చేసినట్టు తెలుస్తోంది. ఇలా వెలుగులోకి...: షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొద్దిరోజుల క్రితం ఈ మాయాజాలంపై ఫిర్యాదుతో చేయడంతో రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. అక్రమంగా పరిహారం పొందారంటూ 80మందికి తాఖీదులు జారీ చేశారు.

అనర్హులని తెలిసే...

కొత్తూరు పట్టణానికి బెంగళూరు–హైదరాబాద్ జాతీయ రహదారి, శంషాబాద్ జాతీయ రహదారి సమీపంలో ఉండటంతో గత ప్రభుత్వం సిద్ధాపూర్ మండలంలో ఆహారశుద్ధి పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు మూడేళ్ల క్రితం నిర్ణయం తీసుకుంది. సిద్ధాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 252, 278, 361లలో 160 ఎకరాల అసైన్డ్ భూమిని సేకరించారు.

సాగు చేసుకుంటున్న అసైనీలకు ఎకరాకు రూ. 10లక్షల చొప్పున నష్టపరిహారం ఇస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు. అసైన్డ్‌భూములను సేకరిస్తున్నప్పుడే షాద్‌నగర్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కొందరు అధికారులు, కొత్తూరులోని కొందరు రాజకీయనాయకులు తాము కూడా లబ్ధి పొందాలని యోచించారు. 160ఎకరాలను సాగుచేస్తున్న రైతుల జాబితాతో పాటు మరో 80మంది పేర్లను జాబితాలో చేర్చారు.

# నామరూపాల్లేకుండా చేశారిలా



మొయినాబాద్ : ఒకప్పుడు భాగ్యనగర వాసులదాహార్తిని తీర్చిన శంకర్‌పల్లి మండలం బుల్కాపూర్ నాలా చాలాచోట్ల కనుమరుగైంది. మిగిలింది కళ్లముందే ఆక్రమించుకుంటున్నా సాగునీటి, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఎగువన వర్షాలు కురిస్తే అనేక ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి.

ఈ ప్రాంతంలో స్థిరాస్తి వ్యాపారం పుంజుకోవడం, లేఅవుట్‌లు, అపార్టుమెంట్‌లు, విల్లాల నిర్మాణాలతో నాలా ఎక్కడికక్కడే కబ్జాదారుల చేతిల్లోకి వెళ్లిపోయింది. నగర పరిధిలో మురుగు కాలువగా మారింది. భారాస నాయకుడు కేటీఆర్ ఆధీనంలోని జన్వాడ అతిథిగృహం కూడా దీని ఎఫ్‌టీఎల్‌లోనే ఉందని ఇటీవల అధికారులు సర్వే చేశారు. గతంలో వర్షాలతో నగరంలో ముంపు సమస్య తలెత్తగా.. షేక్‌పేట ప్రాంతంలో 20 నుంచి 30 అడుగుల విస్తీర్ణం మేర కాలువను ఆక్రమించి నిర్మించినట్లు గుర్తించి ఎర్రరంగుతో మార్కింగ్ చేశారు. కబ్జాలను తొలగించలేదు.సుమారు 55.12 కి.మీ.ల పొడవైనా నాలాను నిజాం నవాబు తవ్వించారు.శంకర్‌పల్లి మండలం నుంచి మొదలై నార్సింగ్, టోలీచౌక్, బంజారాహిల్స్, ఖైరతాబాద్ మీదుగా సాగి హుస్సేన్‌సాగర్‌లో కలుస్తుంది.

ఇదీ ప్రస్తుత పరిస్థితి!

ఈ నాలా గండిపేట మండలం ఖానాపూర్ వరకు సుమారుగా 22 కి.మీ.లు విస్తరించింది. ఒకప్పుడు 33 అడుగుల విస్తీర్ణంలో ఉండగా.. కొన్నిచోట్ల ఆనవాళ్లు లేవు. కొందరు లేఅవుట్లు వేసి మట్టితో నింపేశారు. మణికొండ మర్రిచెట్టు వద్ద నాలా ఆనవాళ్లు లేవు. మణికొండ బీరప్పస్వామి ఆలయం వద్ద నాలాపై నిర్మాణాలు చేపట్టారు. రాయదుర్గం దర్గాహుస్సేన్‌షావలీలో కబ్జాలతో కుంచించుకుపోయింది. మియాఖాన్‌గడ్డలో నాలా ఆక్రమణలతో చిక్కిపోగా.. మిర్జాగూడ వద్ద మురుగు కాలువగా మారింది. బుల్కాపూర్ సమీపంలోని మొండికత్వకు గండిపడగా ఇప్పటి వరకు మరమ్మతులు చేయలేదు.

గండిపేట మండలంలో 15 కి.మీ మేర విస్తరించి ఉండగా.. వట్టినాగులపల్లి, ఖానాపూర్ మధ్యలో 40కిపైగా కల్వర్టులు నిర్మించారు. ఖానాపూర్ వద్ద బఫర్ జోన్‌లో నిర్మాణాలు చోటుచేసుకున్నాయి.

షేక్‌పేటలో 3 కి.మీ.ల పొడవునా ఆక్రమించేశారు. బఫర్ జోన్‌ను మాయంచేశారు.

షేక్‌పేట శ్మశాన వాటిక వద్ద ఓ సంస్థ 300 మీటర్ల పొడవునా బఫర్ జోన్‌ను ఆక్రమించి రేకులషెడ్లు నిర్మించింది. ఒడ్డున ఉన్న ప్రాంతాన్ని చదును చేసి పక్కా నిర్మాణాలకు యత్నిస్తున్నారు.

కోకాపేట వద్ద హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో రోడ్డును పూర్తిగా నాలాపైనే నిర్మించారు. శాంతినగర్ వద్ద పూర్తిగా కనుమరుగైంది. ఓఆర్ఆర్ రోటరీ వద్ద 8 వరుసల రోడ్డును కల్వర్టులు లేకుండానే నిర్మించారు. షేక్‌పేటలోనే ఓ గేటెడ్ కమ్యూనిటీకి సంబంధించి బఫర్‌జోన్‌లో క్రీడా, వినోద కేంద్రాలు కట్టారు.

అల్‌హమ్రా కాలనీలో ఇళ్లను నాలాలోనే నిర్మించారు. ఎర్రకుంట శ్మశాన వాటిక చెంత నాలా 50 అడగులకు 5 అడుగులకు కుంచించుకుపోయింది. లక్ష్మీనగర్‌లో పలు భవనాలను నాలాలోనే నిర్మించారు.

కార్వాన్, నాంపల్లి నియోజకవర్గంలో సుమారు 3.5కి.మీ .ల అభివృద్ధికి గత ప్రభుత్వం రూ. 58 కోట్లు కేటాయించినా.. పనులు కొనసాగుతూనే ఉన్నాయి. 58 చోట్ల ఆక్రమణలున్నాయి.

# సాంకేతికతకు అగ్రస్థానం.. ఐఐటీ బాంబే



మిర్యాలగూడ : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, బాంబే భారతదేశంలోని ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో ఒకటి. దీనిని 1958లో ముంబయిలోని పొవాయిలో 545 ఎకరాల విస్తీర్ణంలో స్థాపించారు. 100 మంది విద్యార్థులతో మొదలైన విద్యాలయం ఇప్పుడు 10 వేల మందికి చేరుకుంది. ఇక్కడ 15 కోర్సుల్లో 1,204 మందికి ప్రవేశం కల్పిస్తున్నారు. 2023లో అత్యధిక వార్షిక వేతనం రూ. 3.67 కోట్లు అందుకున్న వారు ఈ క్యాంపస్ నుంచే ఉన్నారు. గతేడాది 50 జేఈఈ అడ్వాన్స్‌డ్ టాపర్లలో 46 మంది దీన్నే ఎంచుకున్నారు. విశాలమైన క్యాంపస్, ప్రైమ్ లొకేషన్, గొప్ప ప్లేస్‌మెంట్స్, ప్రీమియర్ రీసెర్చ్ సదుపాయాలు, ప్రపంచస్థాయి సిబ్బంది కలిగి టాపర్లను ఆకర్షిస్తోంది.

ఈ నేపథ్యంలో ఐఐటీ బాంబేలో పీజీ(ఎం.టెక్) చేస్తున్న మిర్యాలగూడకు చెందిన వడత్య వేదశ్రీ పలు విషయాలు పంచుకున్నారిలా.. ‘ నాన్న వెంకట్రాంనాయక్ పెద్దవూర మండలం పోతునూరు ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా, అమ్మ లావూరి పద్మ మిర్యాలగూడ మండలం జాలుబాయితండా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. 2019లో బాంబే ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో చేరి.. 2023లో ఇంజినీరింగ్ పూర్తిచేసుకుని 2023 ఆగస్టు నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో ‘ఎలక్ట్రానిక్ పవర్ సిస్టమ్’పై పీజీ(ఎంటెక్) చేస్తున్నా. విద్యార్థుల్లో ఆలోచన, ఆత్మస్థైర్యం పెంచేలా బోధన సాగుతోంది. పుస్తకాల్లో లేని ప్రశ్నలు పరీక్షల్లో వస్తుండడంతో తాము నిరంతరం గ్రంథాలయాల్లో పుస్తకాలు, ఆన్‌లైన్‌లో సమాచారం సేకరించి నోట్స్‌ని ఏర్పాటు చేసుకుంటాం. పలు అంశాలపై చేసిన పరిశోధన పత్రాలను పరిశీలనకు పంపినప్పుడు, ప్రొఫెసర్లు పరిశీలించి, ఉత్తమమైనవాటిని ఇతరుల కోసం ఆన్‌లైన్‌లో పెడతారు. హాస్టళ్లు, మెస్‌ల నిర్వహణలో విద్యార్థుల భాగస్వామ్యం ఉంటుంది. నెలవారీగా సమావేశాలు నిర్వహించి ప్రొఫెసర్ల పనితీరు, విద్యార్థుల సమస్యలపై చర్చిస్తారు. కళాశాల చుట్టూ చెట్లూ, సరస్సు, కొండలు ఉండడంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. ఆంధ్ర–తెలంగాణలో నిర్వహించే వినాయక చవితి, దసరా, శ్రీరామనవమితో పాటు ఉత్తరాదిన నిర్వహించే దుర్గామాత ఉత్సవాలను క్యాంపస్‌లో ఘనంగా నిర్వహిస్తారు.

# రైతు బేజారు!

సిరిసిల్ల : ఆధునిక హంగులతో రైతుబజారును నిర్మించారు. అన్ని వసతులు కల్పించారు. అనువుగా ఉన్న సముదాయాలను వదిలి రహదారులపై విక్రయాలు సాగిస్తున్నారు. ఫలితంగా నిత్యం క్రయ, విక్రయదారులతో రద్దీగా ఉండాల్సిన రైతుబజార్ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేటట్లు చూడాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో కోట్లాది రూపాయాలతో నిర్మించిన షెడ్లు పాడుబడుతున్నాయి.జిల్లా కేంద్రంలో పాత బస్టాండు సమీపంలోని వైద్యుల కాలనీ, కొత్త బస్టాండు ఎదురుగా, గాంధీచౌక్ సమీపంలో కూరగాయలు, పండ్ల విక్రయాలు సాగుతుంటాయి. సిరిసిల్ల పట్టణంలో సుమారు 300 మంది పైగా ఇదే వ్యాపారంపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రధానంగా పాత కూరగాయల మార్కెట్‌లో వినియోగదారుల రద్దీ ఉంటుంది. పాత భవనంలో చోటు లేకపోవడంతో వీధుల్లోని రోడ్లపైనే అమ్మకాలు సాగుతున్నాయి. చేపలను రహదారి పక్కనే విక్రయిస్తున్నారు. అపరిశుభ్రమైన ప్రాంతంలో కడిగి ముక్కలుగా చేస్తున్నారు. దుమ్ముధూళి పడిన మాంసాన్ని తిని వినియోగదారులు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు లేకపోలేదు. అలాగే బయట అమ్మకాలు జరిపే విక్రయదారులు ఎండ, వానలతో నానా అవస్థలు పడుతున్నారు.

రహదారిపై విక్రయాలు జరుగుతుండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రం



అవుతుంది. ఆ దారి గుండా వెళ్లే ద్విచక్రవాహన చోదకులు చుక్కలు చూస్తున్నారు. అక్కడికి వచ్చే వారు రహదారి దాటుతుండటం, ఆటోలు నిలపడంతో సిద్దిపేట– సిరిసిల్ల ప్రధాన రహదారిపై కొంత ఇబ్బంది అవుతుంది.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..


సిరిసిల్ల రైతులు, కూరగాయల విక్రేతలకు సౌకర్యాల కల్పన దిశగా గత ప్రభుత్వం రైతు బజార్ నిర్మించింది. రూ. 5.17 కోట్లతో రెండేళ్ల క్రితమే సముదాయాలు రూపుదిద్దుకున్నాయి. ఆధునిక హంగులు, సకల వసతులతో అందుబాటులోకి తెచ్చారు. సుమారు వంద మంది అమ్ముకునే సౌలభ్యం ఉంది. అక్కడికి వచ్చే వినియోగదారులు వాహన పార్కింగ్‌కు సైతం స్థలం అనువుగా ఉంది. అయినప్పటికీ అందులో విక్రయాలు చేసేందుకు రైతులు, వ్యాపారులు ముందుకు రావడం లేదు. అక్కడ కూరగాయలకు గుత్త వేలాలు మాత్రమే సాగుతున్నాయి. జన సంచారం లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తాం గాంధీచౌక్ ఏరియాలో రహదారులపై విక్రయాలు సాగుతున్న విషయం మా దృష్టిలో ఉంది. రైతులు, వ్యాపారులను పిలిచి మాట్లాడుతాం. రైతు బజార్‌లో అమ్మకాలు జరిపేలా వారికి అవగాహన కల్పిస్తాం.మీర్జా ఫసహత్ అలీ బేగ్, మున్సిపల్ కమిషనర్

## పేరుకే కౌమార స్వస్థ్య కేంద్రాలు

పెద్దపల్లి: కౌమార దశకు ఎదుగుతున్న బాల, బాలికల్లో ఎన్నో శారీరక, మానసిక మార్పులు చోటు చేసుకుంటాయి. ఇంట్లో తల్లిదండ్రులు, సన్నిహితులు, మిత్రుల వద్ద సైతం కొన్ని విషయాలు చెప్పేందుకు వారు వెనుకంజ వేస్తారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం స్వస్థ్య కేంద్రాల(యువ క్లినిక్)ను ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 67 పీహెచ్‌సీలు, 20 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా వీటి పరిధిలో 13,87,552 మంది కౌమార బాల, బాలికల జనాభా ఉంది. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆరోగ్య కేంద్రాలన్నింటిలో ‘యువ క్లినిక్’ బోర్డులు ఏర్పాటు చేశారే తప్ప 10 నుంచి 19 ఏళ్ల వయసున్న వారికి ఆరోగ్య సేవలు, కౌమార దశ లక్షణాలు, మార్పులు, మానసిక ఒత్తిడిని జయించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదు. ఆయా అంశాలను ‘ఈనాడు’ క్షేత్రస్థాయిలో పరిశీలించి పెద్దపల్లి జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి ప్రమోద్‌కుమార్‌వద్ద ప్రస్తావించగా ప్రతి మంగళ, గురువారాల్లో ఆయా పాఠశాలకు సమాచారం ఇచ్చి ఉపాధ్యాయుల సమక్షంలో ఈ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కాలానుగుణ వ్యాధులకు సంబంధించిన కేసులు పెరుగుతుండటంతో వైద్యులకు తీరిక లేకుండా పోయిందని, ప్రత్యేకంగా ఈ కేంద్రాల్లో ఆరోగ్య సేవలు అందించడం లేదని తెలిపారు.

భరోసా వచ్చేనా? యువ క్లినిక్‌లు పేరుకు మాత్రమే ఉన్నాయి. వీటిలో చిన్నారులకు అన్నిరకాలుగా చేయూత అందించాల్సి ఉండగా కనీసం



పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా వైద్యాధికారులు తగు రీతిలో స్పందించి బాలికలకు భరోసా కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వివిధ సమస్యలపై ఈ కేంద్రాల్లో వైద్యులు అవగాహన కార్యక్రమాలు చేపడతారు. బంధువులు, బంధుత్వాల గురించి, మంచి, చెడు స్పర్శలపై బాలికలకు వివరిస్తారు. రుతుస్రావం సమయంలో మానసిక ఆందోళనలకు గురయ్యే వారికి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇస్తారు.

వ్యసనాలకు గురైన బాలురను గుర్తించి వారికి మద్యపానం, ధూమపానం, గంజాయి సేవనం వల్ల కలిగే దుష్పరిణామాలపై వివరిస్తారు. లైంగిక విజ్ఞానం, ఆరోగ్యం, పరిశుభ్రత అంశాలతో పాటు క్రమపద్ధతిలో వ్యాయామం, పోషకాహారం తీసుకునేలా ప్రోత్సహిస్తారు. బాలికలకు నెలసరి సమయంలో తీసుకోవాల్సిన పరిశుభ్రతలపై మహిళా వైద్య నిపుణులతో వివరిస్తారు.ఈ కేంద్రాలకు స్వయంగా రాలే వారు తమ సందేహాలకు ఆశ, ఏఎన్ఎం కార్యకర్తలను సంప్రదించేందుకు 79865 56789 నెంబరు కేటాయించగా అది పనిచేయడం లేదు. కరీంనగర్, రామగుండం, జగిత్యాల, సిరిసిల్ల, వేములవాడ, మంథని వంటి ప్రాంతాల్లో ఎక్కువగా గంజాయి తాగడం, పోక్సో కేసులు, గుట్కా, మద్యపానం కేసుల్లో కౌమార దశలో ఉన్న బాలురే ఉంటుండటం ఆందోళన కలిగిస్తోంది. అధికారులు స్పందించి ఆయా కేంద్రాల్లో సేవలను మెరుగు పరచాల్సిన అవసరముంది.




## బుడమేరుకు మళ్లీ పెరుగుతున్న వరద ప్రవాహం.. గండి పూడ్చే పనులకు ఆటంకం

విజయవాడ: బుడమేరుకు మళ్లీ క్రమంగా వరద పెరుగుతోంది. మంగళవారం సుమారు వెయ్యి క్యూసెక్కుల ప్రవాహం కొనసాగింది. కానీ బుధవారం ఎగువ ప్రాంతం నుంచి 8 వేల క్యూసెక్కుల వరద వస్తుందని అంచనా వేస్తున్నారు.

దీంతో మరో అడుగు పెరగొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. గండి పడిన చోట ప్రస్తుతం బుడమేరు ప్రవాహం 3 అడుగులకు చేరింది. ఇప్పటికే మొదటి గండిని పూడ్చారు. మిగతా 2 గండ్లు పూడ్చేలా పనులు జరుగుతున్నాయి. పెరుగుతున్న వరద ప్రవాహంతో పనులకు ఆటకం కలుగుతోంది. మంత్రులు నారా లోకేశ్, నిమ్మల రామానాయుడు దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు.

మళ్లీ ప్రవాహం పెరుగుతుందని స్థానికులను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. మిగిలిన గండ్లు పూడ్చే ప్రక్రియను పర్యవేక్షించాలని నిమ్మల రామానాయుడిని లోకేశ్ కోరారు. క్షేత్రస్థాయిలోనే ఉండి పర్యవేక్షించాలన్నారు.




విజయవాడ: వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. విజయవాడలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎక్కడ ఎలాంటి అవసరమొచ్చినా తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బురద తొలగింపు పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. 62 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2,100 మంది పారిశుద్ధ్య సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వందకుపైగా ఫైరింజన్లు సహాయక చర్యలో పాల్గొన్నాయని, పొక్లెయిన్లు, టిప్పర్ల ద్వారా వేస్టేజ్‌ను తరలిస్తున్నామని తెలిపారు. "సహాయచర్యల్లో 32 మంది ఐఏఎస్‌లు పనిచేస్తున్నారు. 179 సచివాలయాలకు 179 సీనియర్ అధికారులకు ఇన్‌ఛార్జులుగా పెట్టాం. ఎవరైనా చనిపోతే మృతదేహాలను బంధువులకు అప్పగిస్తున్నాం. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం అందించాలని ఆదేశాలిచ్చాం. మంగళవారం 9,09,191 ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశాం. ఇవాళ ఇప్పటి వరకు 6లక్షల ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశాం. 8.50లక్షల వాటర్ బాటిళ్లు, 3లక్షల లీటర్ల పాలు, 5లక్షల బిస్కెట్ ప్యాకెట్లు అందించాం. 5లక్షల మందికి భోజన ఏర్పాట్లు చేశాం. గర్భిణిలకు ప్రత్యేక వైద్యం అందించాలని ఆదేశాలిచ్చాం.

**విజయవాడకు బుడమేరే ప్రధాన సమస్య..** విజయవాడకు బుడమేరు ప్రధాన సమస్యగా తయారైంది. చిన్న చిన్న వాగులన్నీ కలిసి బుడమేరు పెద్దదిగా మారింది. అటు కృష్ణానది, ఇటు బుడమేరు కలిసి విజయవాడను ముంచెత్తాయి.

బుడమేరును గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఐదేళ్లపాటు ఏం చేశారని వైకాపా నేతల్ని ప్రశ్నిస్తున్నాం. వాగులను కబ్జా చేయడమే ఈ దుస్థితికి కారణం. ఆఖరికి పోలవరం కాలువలోనూ మట్టిని తవ్వేశారు. బుడమేరు నీరు కొల్లేరు, కృష్ణానదికి వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. బుడమేరు ప్రవాహ దారిలో కాలువలు, వాగుల్లో కబ్జాలు తొలగిస్తాం. ఇలాంటి విపత్తులను అందరూ సమష్టిగా ఎదుర్కోవాలి. వరద బాధితులు అందరికీ న్యాయం చేస్తాం. రేపు ఉదయానికి వరద పూర్తిగా తగ్గిపోతుంది"అని చంద్రబాబు తెలిపారు.

**సాయం చేయకపోగా నిందలేస్తారా?** అమరావతి మునిగిపోయిందని తప్పుడు ప్రచారం చేయడం సరికాదు. ఇలాంటి రాజకీయ నేరస్తులను, తప్పుడు ప్రచారం చేసేవారిని సంఘ బహిష్కరణ చేయాలి. వైకాపాలాంటి పార్టీకి రాష్ట్రంలో ఉండే అర్హత లేదు. సాయం చేయకపోగా నిందలేసి.. తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రజల కోసం నేను యజ్ఞం చేస్తుంటే.. వైకాపా నేతలు రాక్షసుల్లా అడ్డం పడుతున్నారు. ప్రజలకు సేవ చేస్తూ.. రాక్షసులతో యుద్ధం చేయాల్సి వస్తోంది. ఇకనైనా బురద జల్లడం ఆపి ప్రజలకు క్షమాపణ చెప్పాలి.

**ఏపీకి రావాలని అమిత్ షాను కోరా..** కేంద్రమంత్రి అమిత్ షాతో ఫోన్లో మాట్లాడాను. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలని కోరా. విజయవాడ, అమరావతి ముంపు బారిన పడకుండా కార్యాచరణ రూపొందిస్తాం. వరద బాధితులను బోట్లలో తీసుకెళ్లడం కోసం డబ్బులు అడిగితే అరెస్టు చేసి కేసులు పెడతాం. ప్రైవేటు బోట్ల వాళ్లు కూడా డబ్బులు వసూలు చేయొద్దని చెప్పారు. నిత్యవసర వస్తువుల ధరలు పెంచుకుండా ఉండేలా ప్రణాళిక రూపొందించాం. కూరగాయల ధరలు ప్రభుత్వమే ఫిక్స్‌డ్ రేట్ పెడుతుంది. సాయంత్రం లేదా గురువారం నుంచి నిత్యవసర వస్తువుల పంపిణీ చేపడతాం. వివిధ ఉద్యోగ సంఘాలు ఒక్క రోజు జీతం విరాళం ఇవ్వడానికి ముందుకొచ్చాయి"అని చంద్రబాబు తెలిపారు.

## తెలంగాణలో హైడ్రా మాదిరి.. బుడమేరు ఆక్రమణలు తొలగించండి: వైఎస్ షర్మిల



విజయవాడ: విజయవాడ ముంపును జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. గురువారం సింగ్‌నగర్ ప్రాంతంలో పర్యటించిన ఆమె.. వరద బాధితులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధితులను పూర్తిస్థాయిలో ఆదుకోవాలని కోరారు. వరద ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు పర్యటించి ప్రజలకు ధైర్యం చెప్పడం మంచి విషయమన్నారు. బుడమేరు రక్షణకు వెంటనే చర్యలు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణలో హైడ్రా మాదిరి.. బుడమేరు ఆక్రమణలు తొలగించాలని సూచించారు. "కొంప కొల్లేరు అయ్యింది.. బెజవాడ బుడమేరు అయింది. విజయవాడ వరదలకు బుడమేరే కారణం. వరద నీరు కొల్లేరుకు చేరేలా చర్యలు చేపట్టాలి. ఈ ప్రమాదం రాకుండా చూడాల్సిన భాధ్యత ప్రస్తుతం చంద్రబాబు మీదే ఉంది. బుడమేరుకి రిటర్నింగ్ వాల్ కట్టాలి. వరదల్లో ఇప్పటి వరకు 35 మంది చనిపోయారు. 5లక్షల మంది నష్టపోయారు. ఇది ఘోర విపత్తు. ఇంత పెద్ద విపత్తు సంభవిస్తే ప్రధాని మోదీ కనీసం స్పందించలేదు. విజయవాడ వరదలు కేంద్రానికి కనిపించడం లేదు. ఇక్కడి ఎంపీల మద్దతుతో ప్రధాని అయ్యాననే సంగతి మరిచారు. ఏపీ ప్రజల కష్టాలు మోదీకి కనిపించడంలేదు. వెంటనే స్పందించి జాతీయ విపత్తుగా ప్రకటించాలి. నష్టపోయిన ప్రతి ఇంటికి కనీసం రూ.లక్ష సాయం చేయాలి" అని షర్మిల డిమాండ్ చేశారు.

## విజయసాయిరెడ్డి కుమార్తె అక్రమ నిర్మాణాలు కూల్చివేత

భీమిలి గ్రామీణం: విశాఖ జిల్లా భీమిలి తీరంలో వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ కట్టడాలను జీవీఎంసీ అధికారులు కూల్చివేస్తున్నారు. భీమిలి జోన్ పట్టణ సహాయ ప్రణాళికాధికారి బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఉదయం 7 గంటల నుంచి బీచ్ ఒడ్డున హెూటల్ కోసం వేసిన కాంక్రీట్ పిల్లర్స్, గోడలు, ఇతర నిర్మాణాలను తొలగిస్తున్నారు. కూల్చివేతల సందర్భంగా భీమిలి పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ తొలగింపు ప్రక్రియను ఎవరూ అడ్డుకోకపోవడంతో సజావుగా జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. తొలగింపు పూర్తయ్యే సరికి సాయంత్రం అవుతుందని అంచనా వేస్తున్నారు. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ ముఖ్య నాయకులు ఇక్కడి భూములను దౌర్జన్యంగా పెద్ద స్థాయిలో ఆక్రమించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో విజయసాయిరెడ్డి కుమార్తె అక్రమాలపై జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్, మరికొందరు కూటమి నేతలు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం భీమిలి తీరంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు నిర్ధరించింది. వీటిని వెంటనే తొలగించాలని ఉత్తర్వులు జారీ చేయడంతో ఆ మేరకు అధికారులు తొలగింపు ప్రక్రియ చేపట్టారు.

కూల్చివేతల పట్ల విశాఖ నగరవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైకాపా నాయకులు పాల్పడిన మరిన్ని భూఅక్రమాలపై చర్యలు తీసుకోవాలని వారంతా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## వరద బాధితులకు.. పవన్ రూ.6 కోట్ల సాయం

అమరావతి: భారీ వర్షాలు, వరదల కారణంగా తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ భారీ విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు బుధవారం ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న ఆయన రూ.6 కోట్లు తనవంతు సాయంగా ఇస్తున్నట్లు చెప్పారు. ఇందులో ఏపీ, తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్స్‌కు రూ.కోటి చొప్పున ఇస్తానని.. ఏపీలోని 400 పంచాయతీలకు రూ.లక్ష చొప్పున మొత్తం రూ.4 కోట్లు ఆర్థిక సాయం చేస్తున్నట్లు వెల్లడించారు.

**గత ప్రభుత్వం తీరువల్లే ఈ ఇబ్బందులు..** "ప్రస్తుతం వరద తగ్గుతోంది. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. గత ప్రభుత్వం తీరువల్లే ఈ ఇబ్బందులు. పెద్ద ప్రమాదం తప్పింది. సహాయం కోసం 112, 1070, 18004250101 ఫోన్ చేయండి. ప్రకృతి విపత్తు సమయంలో నిందల కంటే ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు రావాలి. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ఏం చేయాలనేది మంత్రివర్గంలో చర్చిస్తాం. ప్రతి నగరానికి మాస్టర్ ప్లాన్ తయారు చేస్తాం. వరద నిర్వహణ కోసం బృహత్తు ప్రణాళిక తయారు చేస్తాం. వరద ప్రాంతంలో పర్యటించాలనుకున్నా.

కానీ, నా వల్ల సహాయ కార్యక్రమాలకు ఆటంకం కలగకూడదని భావిస్తున్నా. నా పర్యటన సహాయ పడేలా ఉండాలే తప్ప అదనపు భారం కాకూడదు. వరద సమయంలో మా శాఖ క్షేత్రస్థాయిలో పనిచేస్తోంది. నేను రాలేదని నిందలు వేయాలని అంటారు తప్ప.. మరొకటి కాదు"అని పవన్ కల్యాణ్ అన్నారు.




## తెలుగు రాష్ట్రాలకు జస్టిస్ ఎన్వీ రమణ విరాళం..

ఢిల్లీ: రెండు తెలుగు రాష్ట్రాలు వరద కారణంగా తీవ్రంగా నష్టపోయాయి. ఏపీలోని పలు జిల్లాలు, తెలంగాణలోని పలు జిల్లాలు వరద ఉధృతికి తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రజానీకానికి నిలువ నీడ కూడా లేకుండా పోయింది. వరద నష్టం అంచనాలకు అందడం లేదు. ఈ తరుణంలో రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రజలకు సాయమందించేందుకు శ్రమిస్తున్నా సరిపడా వనరులు లేక ఇబ్బంది పడుతున్నాయి. ఈ తరుణంలోనే విరాళాలను అర్థిస్తున్నాయి. దీనికి సినీ, రాజకీయ, ఇతర రంగాలకు చెందిన ప్రముఖుల నుంచి మంచి స్పందన వస్తోంది. తమ వంతు సాయంగా రెండు తెలుగు రాష్ట్రాలకు విరాళాలను ప్రకటిస్తున్నారు. ఇవాళ ఉదయం మెగాస్టార్ చిరంజీవి రెండు తెలుగు రాష్ట్రాలకు చెరో రూ.50 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే.

**తెలుగు రాష్ట్రాల సీఎంలను అభినందించిన జస్టిస్ ఎన్వీ రమణ..** వరద బాధితుల సహాయార్థం సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ విరాళం అందించారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెరో 10 లక్షల రూపాయలు చెక్‌లను రెండు రాష్ట్రాల రెసిడెంట్ కమిషనర్లకు జస్టిస్ ఎన్వీ రమణ అందించారు. వరద సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్న రెండు రాష్ట్రాల సీఎంలను జస్టిస్ ఎన్వీ రమణ అభినందించారు. ఏపీ అడిషనల్ రెసిడెంట్ కమిషనర్ హిమాన్షు కౌశిక్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్‌కు జస్టిస్ ఎన్వీ రమణ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎన్వీ రమణ మీడియాతో మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఉదారంగా సహాయాన్ని అందించాలన్నారు.

**ఆకలి, అశాంతి ఉంటే ఎంత సంపద ఉన్నా అనుభవించలేం..** తుపాన్ కారణంగా మరణాలు సంభవించడం దురదృష్టకరమని జస్టిస్ ఎన్వీ రమణ పేర్కొన్నారు. తోటి మనుషులు కష్టాల్లో ఉన్నారు కాబట్టి గురజాడ స్ఫూర్తితో తన వంతు సహాయాన్ని అందించానన్నారు. చైతన్యంతో ముందుకు వచ్చి కష్టాల్లో ఉన్నవారికి తోచిన విధంగా అందరూ సహాయాన్ని అందించాలని చేతులు జోడించి నమస్కరిస్తున్నానని పేర్కొన్నారు.

రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నిర్విరామంగా పనిచేస్తున్నారు. వారికి అండగా నిలవాలని కోరారు. సమాజంలో ఆకలి, అశాంతి ఉంటే ఎంత సంపద ఉన్నా మనం అనుభవించలేమనే విషయాన్ని అందరూ గమనించాలన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ కి ఆర్థిక సహాయాన్ని అందించిన జస్టిస్ ఎన్వీ రమణకు రెండు రాష్ట్రాల ఆర్సీలు కృతజ్ఞతలు తెలిపారు.




అమరావతి: విపత్తు సమయంలో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బుడమేరులోని 90 శాతం ఆక్రమణలే విజయవాడకు శాపంగా మారాయని పవన్ అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం చంద్రబాబు సమర్థంగా పనిచేస్తున్నారని కొనియాడారు. ఈ వయసులోనూ జేసీబీలు, ట్రాక్టర్లు ఎక్కి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నారన్నారు. ఆయన్ను అభినందించాల్సింది పోయి విమర్శలు చేయడం సరికాదని వైకాపా నేతలను ఉద్దేశించి హితవు పలికారు. వైకాపా నేతలు ముందు సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని.. ఆ తర్వాతే ఆరోపణలు చేయాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లడం లేదంటూ వైకాపా నేతలు చేస్తున్న విమర్శలపై పవన్ స్పందించారు. తాను వెళ్తే సహాయక చర్యలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. అధికార యంత్రాంగానికి ఒత్తిడి ఉంటుందని చెప్పడంతో తాను వెళ్లలేదని చెప్పారు. "ఇంకా విమర్శించాలనుకుంటే వైకాపా నేతలు నాతో పాటు ఎక్కడికైనా రావొచ్చు. నా కాన్వాయ్‌లోనే తీసుకెళ్తాను. నాతో నడవండి.. ఎలా ఉంటుందో చూడండి. అప్పుడు మీరే సలహా ఇస్తారు. ఇది రాష్ట్ర సమస్య. వైకాపా నేతలు సహాయం చేసి మాట్లాడాలి. ఇళ్లలో కూర్చొని విమర్శలు చేస్తే సరిపోదు"అని పవన్ వ్యాఖ్యానించారు. సహాయ కార్యక్రమాల్లో పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది పాల్గొంటున్నారని పవన్ తెలిపారు. 175 బృందాలు విజయవాడ అర్బన్‌లో పనిచేస్తున్నాయన్నారు. వరద ప్రభావం లేని జిల్లాల నుంచి వచ్చిన 900 మంది పారిశుద్ధ్య కార్మికులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు వివరించారు. వరదలకు ఎక్కువగా ఎన్టీఆర్ జిల్లా దెబ్బతిందని తెలిపారు. 26 ఎన్డీఆర్ఎఫ్, 24 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు. నేవీ నుంచి 2, ఎయిర్‌ఫోర్స్ నుంచి 4 హెలికాప్టర్ల ద్వారా ఆహార పంపిణీ జరుగుతోందని చెప్పారు.

## వైకాపా నేతల విజ్ఞప్తిని తిరస్కరించిన ఏపీ హైకోర్టు




అమరావతి: వైకాపా నేతలకు హైకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. తెదేపా కార్యాలయం, చంద్రబాబు నివాసంపై దాడి కేసుల్లో ముందస్తు బెయిల్‌కు నిరాకరిస్తూ ఉన్నత న్యాయస్థానం బుధవారం ఉదయం ఆదేశాలు జారీ చేసింది.

దీనిపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు రెండు వారాల పాటు అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని వైకాపా నేతలు ఉన్నత న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. అరెస్టు నుంచి మినహాయింపు ఇవ్వొద్దని తెదేపా తరఫు న్యాయవాదులు కోర్టును కోరారు. దీనిపై ఇవాళ సాయంత్రం హైకోర్టు నిర్ణయం వెలువరించింది. వైకాపా నేతల విజ్ఞప్తిని తిరస్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తెదేపా కార్యాలయంపై దాడి కేసులో దేవినేని అవినాష్, నందిగం సురేష్, లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం నిందితులుగా ఉన్నారు. చంద్రబాబు నివాసంపై దాడికేసులో జోగి రమేశ్ నిందితుడిగా ఉన్నారు.

**నందిగం సురేష్ ఇంటికి పోలీసులు..** హైకోర్టు ముందస్తు బెయిల్ తిరస్కరించడంతో వైకాపా నేతల అరెస్టుకు రంగం సిద్ధమైంది. మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను అరెస్టు చేసేందుకు పోలీసులు బుధవారం సాయంత్రం ఆయన ఇంటికి వెళ్లారు. పోలీసులు వస్తున్నట్టు ముందుగానే తెలుసుకున్న సురేష్ ఇంటి నుంచి పరారయ్యారు. దీంతో పోలీసులు అక్కడి నుంచి వెనుదిరిగారు.

## 2 కోట్లు విరాళం ప్రకటించిన ప్రభాస్.. అల్లు అర్జున్ కోటి



హైదరాబాద్: కష్టాల్లో ఉన్నవారికి చేయూతనందించడంలో సినీతారలు ఎప్పుడూ ముందుంటారు. ఈనేపథ్యంలోనే తెలుగు రాష్ట్రాల్లో వరద బాధితుల సహాయార్థం ఒక్కొక్కరిగా విరాళాలు ప్రకటిస్తున్నారు. తాజాగా నటుడు ప్రభాస్ రూ.2 కోట్లు విరాళంగా అందించనున్నట్లు టీమ్ తెలిపింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రుల సహాయనిధికి చెరో రూ.కోటి ఇవ్వనున్నట్లు పేర్కొంది. మరోవైపు నటుడు అల్లు అర్జున్ సైతం విరాళం ప్రకటించారు. రెండు రాష్ట్రాలకు కలిపి రూ.కోటి విరాళంగా ఇస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ మేరకు ఎక్స్ (ట్విటర్)లో పోస్ట్ పెట్టారు. ఈ విపత్కర పరిస్థితులు తొందరగా తొలగిపోవాలని ప్రజలంతా సురక్షితంగా ఉండాలని తాను భగవంతుని ప్రార్థిస్తున్నానని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు రెండు తెలుగు రాష్ట్రాల్లో వరద బీభత్సం సృష్టిస్తోంది. దీంతో సినీప్రముఖులు బాధితులకు అండగా నిలుస్తున్నారు. చిరంజీవి రూ.కోటి, బాలకృష్ణ రూ.కోటి, మహేశ్‌బాబు రూ.కోటి, ఎన్టీఆర్ రూ.కోటి, సిద్ధూ జొన్నల గడ్డ రూ.30 లక్షలు, విష్వక్‌సేన్ రూ.10 లక్షలు, వెంకీ అట్లూరి రూ.10 లక్షలు, అనన్య నాగళ్ల రూ.2.5లక్షలు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.25 లక్షల విరాళం ఇస్తున్నట్లు వైజయంతి మూవీస్ తెలిపింది.

**చేయూత అందించే సమయమిది: రూ. కోటి విరాళం ప్రకటించిన రామ్ చరణ్** : నటుడు రామ్ చరణ్ దాతృత్వం చాటుకున్నారు. తెలుగు రాష్ట్రాల వరద బాధితులకు ఆర్థిక సాయం చేసేందుకు ముందుకొచ్చారు. రూ. 50 లక్షల చొప్పున రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయ నిధికి రూ. కోటి విరాళం ప్రకటించారు. "వర్షాలు, వరదల వల్ల ఇబ్బందులు పడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు మనం తోడుగా.. అండగా ఉన్నామంటూ చేయూత అందించాల్సిన సమయమిది. నా వంతు బాధ్యతగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సీఎం రిలీఫ్ ఫండ్‌లకు కోటి రూపాయలు విరాళంగా ప్రకటిస్తున్నా. తెలుగు రాష్ట్రాల ప్రజలు ఈ పరిస్థితి నుంచి త్వరగా బయటపడాలని దేవుడిని ప్రార్థిస్తున్నా" అని పోస్ట్ పెట్టారు.

# గ్రాజియా షూట్: తమన్నా కిల్లర్ ఫోజ్

మిల్కీ వైట్ బ్యూటీ తమన్నా భాటియా సినిమాలు వెబ్ సిరీస్ లలో నటిస్తూ కెరీర్ ని బ్యాలెన్స్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవలే జైలర్ లాంటి బ్లాక్ బస్టర్ చిత్రంలోను తమన్నా నటించింది. ఇక ఈ భామ సోషల్ మీడియాల్లో నిరంతరం అద్భుతమైన ఫోటోషూట్లను షేర్ చేస్తుంటే అవి ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి. తాజాగా గ్రాజియా కవర్ షూట్‌లో తమన్నా స్పెషల్ లుక్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. ఈ ఫోటోలను షేర్ చేసిన క్షణాల్లో నెట్ లో వైరల్ గా మారాయి. తమన్నా తాజా పోటోషూట్ లో ఎలిజబెత్ టేలర్ ని తలపిస్తోంది. మిల్కీ తన దేహశిరులకు తగినట్టుగా చెక్డ్ డిజైనర్ లుక్ ని ఎంపిక చేసుకుంది. కాటుక కళ్లు, లైట్ లిప్ కలర్ తో యూనిక్ గా



కనిపిస్తోంది. బ్యాక్ గ్రౌండ్ లో సెట్ చేసిన మెటీరియల్ యాంబియెన్స్ దీనిని మరింత అందంగా ఎలివేట్ చేస్తున్న సంగతి తెలిసిందే.

**మీరు చూడనివి 5000 ఫోటోలు ఉన్నాయి:** ఇటీవల కొంతకాలంగా నటుడు విజయ్ వర్మ- తమన్నా భాటియా ప్రేమాయణం గురించి మీడియాలో కథనాలొస్తున్న సంగతి తెలిసిందే. విజయ్ తక్కువ సమయంలో తమన్నాతో తన రిలేషన్ గురించి ఎందుకు బహిరంగపరిచాడో వెల్లడించాడు. మేం కలిసి సమయాన్ని గడపడానికి ఇష్టపడితే ..ఒకరినొకరు ఇష్టపడితే, ఈ విషయాన్ని దాచాల్సిన అవసరం లేదు. సంబంధాన్ని దాచడానికి చాలా ప్రయత్నం అవసరం. మేం చేయలేం. కలిసి బయటకు వెళ్లాలి.

నేను పంజరంలో ఉండాలనుకోలేదు అని అన్నారు. కొన్ని విషయాలు దాచాను. నా వద్ద 5,000 కంటే ఎక్కువ ఫోటోలు మా బంధానికి సంబంధించినవి ఎవరూ చూడనివి ఉన్నాయని విజయ్ వర్మ అన్నారు. హృదయానికి దగ్గరగా ఉన్న వాటినిసోషల్ మీడియాలో షేర్ చేయలేదని చెప్పారు. విజయ్ వర్మ - తమన్నా భాటియా లస్ట్ స్టోరీస్ 2 సెట్‌లో ప్రేమలో పడ్డారు. అంతకుముందు నలుగురు వ్యక్తులు మాత్రమే హాజరైన షో ర్యాప్-అప్ పార్టీలో తమన్నాకు లవ్ ఎక్స్ ప్రెస్ చేసానని విజయ్ తెలిపారు.

## ఆ హీరో కొడుక్కి కీర్తి సురేష్ రిలేషన్..!

న్యాచురల్ స్టార్ నానితో కీర్తి సురేష్ రెండు సినిమాల్లో నటించింది. మొదట నేను లోకల్ లో నటించిన ఈ ఇద్దరు మళ్లీ దసరాలో కలిసి నటించారు. నాని, కీర్తి సురేష్ అంటే ఆ సినిమా హిట్ అనేలా సెంటిమెంట్ ఏర్పరచుకున్నారు. ఐతే నాని తో సినిమాలు చేస్తున్న టైం లో అతని ఫ్యామిలీతో ముఖ్యంగా నాని కొడుకు అర్జున్ తో కీర్తి సురేష్ చాల క్లోజ్ అయ్యిందట. ఇదే విషయాన్ని ఆమె రీసెంట్ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. జున్ను తనని అత్త అని పిలుస్తాడు.. తనకు హ్యాపీ బర్త్ డే చెప్పినప్పుడు మిస్ యు.. సీ యూ అనే మాటను ముద్దుగా మూసీ సుయి అంటూ చెబుతాడని. ఎప్పుడైనా తనకు లో అనిపించినప్పుడు ఆ వాయిస్ ఓవర్ వింటానని చెప్పింది కీర్తి సురేష్. ఎప్పుడు హైదరాబాద్ వెళ్లినా జున్ను దగ్గరకు వెళ్తానని కీర్తి సురేష్



చెప్పింది. ప్రస్తుతం కీర్తి సురేష్ నాని ఫ్యామిలీ గురించి ముఖ్యంగా ఆ హీరో తనయుడు అర్జున్ గురించి చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఇక కీర్తి కెరీర్ విషయానికి వస్తే బాలీవుడ్ లో ఈమధ్యనే వరుస సినిమా ఆఫర్లు అందుకుంటున్న అమ్మడు. అక్కడకు వెళ్లాక గ్లామర్ డోస్ పెంచిందన్న టాక్ వినిపిస్తుంది. ఐతే తెలుగులో దసరా తర్వాత కీర్తి సురేష్ కి ఒక్క ఆఫర్ కూడా రాలేదు. కల్కి సినిమాలో బుజ్జి పాత్రకు తన వాయిస్ ఇచ్చి మెప్పించింది కీర్తి సురేష్. దసరా కాంబినేషన్ లో నాని, శ్రీకాంత్ ఓదెల మరో సినిమా చేయబోతున్నారు. ఒకవేళ హీరోయిన్ గా మళ్లీ కీర్తి సురేష్ నే రిపీట్ చేస్తారా అన్న డౌట్ కూడా ఉంది.

అదే జరిగితే మాత్రం దసరా కాంబో మరో సూపర్ హిట్ ఇచ్చేందుకు రెడీ అవుతున్నారని చెప్పొచ్చు. అటు తమిళంలో కూడా తన దూకుడు తగ్గించింది కీర్తి సురేష్. బాలీవుడ్ లో వస్తున్న ఆఫర్లు ఆమె కెరీర్ కు ఎంకరేజ్మెంట్ అందిస్తున్నాయి. మరి ఇక్కడ మహానటిగా గుర్తింపు తెచ్చుకుని నేషనల్ అవార్డ్ కూడా అందుకున్న కీర్తి సురేష్ బాలీవుడ్ లో ఎలాంటి క్రేజ్ తెచ్చుకుంటుందో చూడాలి. కీర్తి మాత్రం బాలీవుడ్ లో పాగా వేయాలనే ఉద్దేశంతోనే అక్కడ పర్ఫెక్ట్ ప్లానింగ్ తో సినిమాలు ఓకే చేస్తుందని తెలుస్తుంది.




# పెళ్లి జరిగిన నెలలోపే మరొకసారి పెళ్లి చేసుకున్న శాండల్‌వుడ్ డైరెక్టర్..





శాండల్‌వుడ్ నటుడు-దర్శకుడు తరుణ్ సుధీర్, నటి సోనాల్ మాంటిరోను వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. సాంప్రదాయ బద్ధంగా బెంగళూరులోని పూర్ణిమ ప్యాలెస్ లో ఆగస్టు 11న వీరిద్దరి వివాహం జరిగింది. ఈ పెళ్లికి సినీ ప్రముఖులతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు కూడా హాజరయ్యారు. శివరాజ్‌కుమార్, గణేష్, శరణ్, జగపతి బాబు, ప్రేమ్, అవినాష్, తార, గిరిజా లోకేష్, శృతి, మేఘనా రాజ్, మేఘా శెట్టి, రచితా రామ్, సుధారాణి, నిస్వికా నాయుడు, పద్మరాజ్ రావు, మాళవిక, దొడ్డన్న, గాయకుడు విజయ్ ప్రకాష్, సంగీత దర్శకులు హంసలేఖ సహా నటీనటులు , హరికృష్ణ, సాధు కోకిల సహా పలువురు సెలబ్రిటీలు నూతన వధూవరులను ఆశీర్వదించారు. అయితే ఈ పెళ్లికి దర్శన్ మాత్రం హాజరు కాలేకపోయాడు అని తరుణ్ సుధీర్ చాలా బాధపడ్డాడు..తన క్లోజ్ ఫ్రెండ్ పెళ్లికి రాలేకపోవడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తూ దర్శన్ ను ఎంతగా మిస్ అవుతున్నాడో తెలియపరిచాడు. నిజానికి ఈ ముహూర్తం దర్శన్ డేట్స్ అడ్జస్ట్ చేసి అరేంజ్ చేయడం జరిగిందట. ఆగస్టు 15 డేట్ ఇచ్చాను ఇక మార్చొద్దు అని దర్శన్ చెప్పాడట. అయితే తీరా తాను పెళ్లి పీటలు ఎక్కే సమయానికి దర్శనం రాలేకపోవడం అతనికి ఎంతో బాధ కలిగిస్తోంది అన్నాడు తరుణ్ సుధీర్. ఆగస్టు 11న ఈ ఇద్దరి పెళ్లి హిందూ సంప్రదాయం ప్రకారం ఘనంగా జరిగింది. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు మధ్య తరుణ్ భాస్కర్, సోనాల్ మెడలో మాంగల్యం కట్టాడు.

అనంతరం సెప్టెంబర్ 2 మంగళవారం నాడు ఈ ఇద్దరు క్రైస్తవ సంప్రదాయం ప్రకారం మరొకసారి వివాహం చేసుకున్నారు.. సోనాల్ మతానికి గౌరవం ఇచ్చి ఇరు కుటుంబాల సమక్షంలో తరుణ్ ఆమెను క్రైస్తవ పద్ధతిలో మరొకసారి పెళ్లి చేసుకున్నారు. ఇరు కుటుంబాల పెద్దల సమక్షంలో ఈ పెళ్లి జరిగింది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఫాన్స్ కూడా అతనికి అభినందనలు తెలియజేస్తున్నారు.

# మహానటి విషయంలో ఆ డౌట్లు అక్కర్లేదు..!





తన సహజ నటనతో సౌత్ ఆడియన్స్ అలరిస్తూ వస్తున్న కీర్తి సురేష్ మహానటి సినిమాతో నేషనల్ అవార్డ్ పర్ఫార్మెన్స్ ఇచ్చింది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన మహానటి సినిమా లో కీర్తి సురేష్ ని సెలెక్ట్ చేశారని తెలియగానే అంత గొప్ప నటీమణి పాత్రలో కీర్తి ఎలా కనిపిస్తుందో అని అనుకున్నారు. కానీ సినిమా రిలీజ్ అయ్యాక చూసి ఆడియన్స్ సైతం షాక్ అయ్యేలా తన అభినయంతో మెప్పించింది. కొన్ని సినిమాలు కొందరి కోసమే అనేలా క్రేజ్ తెచ్చుకుంటాయి. అలానే సావిత్రి బయోపిక్ కీర్తి సురేష్ ముందు మరో హీరోయిన్ ను అనుకున్నా ఆమె కాదని చెప్పడంతో కీర్తికి ఛాన్స్ వచ్చింది. ఇక వచ్చిన ఆ అవకాశాన్ని సద్వినియోగ పరచుకుని సత్తా చాటింది కీర్తి సురేష్. ఐతే ఈమధ్య కొంత గ్లామర్ రోల్స్ చేస్తున్న కీర్తి సురేష్ లోని ఆ సహజ నటిని మళ్లీ చూడగలమా అని కొందరు ఆడియన్స్ డౌట్ పడుతున్నారు. సౌత్ నుంచి ఈమధ్యనే బాలీవుడ్ వెళ్లిన కీర్తి సురేష్ అక్కడ గ్లామర్ డోస్ పెంచి బీ టౌన్ ఆడియన్స్ మెప్పు పొందాలని చూస్తుంది. ఐతే కీర్తి సురేష్ లోని ఈ మార్పు కొంతమంది ఫ్యాన్స్ కి నచ్చట్లేదు. గ్లామర్ డాల్ గా మారిన కీర్తి మళ్లీ అభినయ ప్రాధాన్యత ఉన్న పాత్రలు వస్తే చేస్తుందా అన్న డౌట్ మొదలైంది. అయితే కీర్తి ప్లానింగే అది అన్నట్టుగా చెబుతున్నారు. ఓ పక్క గ్లామర్ రోల్స్ చేస్తూ సౌత్ లో వచ్చే ప్రతిభ చూపించే పాత్రలు చేస్తే మాత్రం సూపర్ అనిపించుకో వచ్చు. ఐతే ఒక్కసారి గ్లామర్ రోల్స్ చేస్తూ వచ్చాక కీర్తి మళ్లీ వీటి వైపు చూస్తుందా వీటిని ఓకే చేస్తుందా అంటే ఆమెలోని నటి తప్పకుండా ఈ రోల్స్ ని యాక్సెప్ట్ చేస్తుందని అంటున్నారు. ఎంత బాలీవుడ్ వెళ్లినా సరే కీర్తికి మంచి పాపులారిటీ తెచ్చిన పాత్రలని మర్చిపోయే ఛాన్స్ లేదు. ఆ రిఫరెన్స్ లను లేదా ఆ సినిమాలను మళ్లీ కీర్తి సురేష్ మరోసారి చూసుకుంది అంటే చాలు. మళ్లీ అమ్మడు నటనా ప్రాధాన్యత ఉన్న పాత్రలకు ఓకే చెప్పేస్తుంది. తెలుగులో అయితే లాస్ట్ ఇయర్ దసరా చేసిన కీర్తి సురేష్ మరో సినిమా ఓకే చేయలేదు. కోలీవుడ్ లో కూడా కీర్తి సురేష్ దూకుడు తగ్గిందనే చెప్పాలి. ఐతే ఈమధ్యే బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన అమ్మడు అక్కడ వరుస ఛాన్సులు అందుకునేలా గ్లామర్ షో చేస్తుంది.

## మాజీపై సానియా మీర్జా క్రిప్టిక్ పోస్ట్?

పాకిస్థాన్ క్రికెటర్ షోయబ్ మాలిక్ నుంచి విడాకులు తీసుకున్న సానియా మీర్జా ఇంతకాలం సైలెంట్ గా ఉన్న సంగతి తెలిసిందే. సానియాకి విడాకులిచ్చి పాకిస్తానీ నటిని పెళ్లాడిన షోయబ్ పై బోలెడంత ట్రోలింగ్ కొనసాగింది. కానీ సానియా సైలెంట్ గా హుందాగా ఉండిపోయింది. అయితే ఇంతకాలానికి టెన్నిస్ స్టార్ సానియా సోషల్ మీడియాలో తన రహస్య పోస్ట్‌తో ప్రజల దృష్టిని ఆకర్షించింది. ఒంటరి తల్లిగా మాతృత్వం, వ్యక్తిగత తిరుగుబాటులోని సవాళ్లను అధిగమిస్తూ సానియా తన సోషల్ మీడియా అనుచరుల కోసం అద్భుతమైన కోట్ ని షేర్ చేసింది. దాని సారాంశం ఇలా ఉంది. "మనకు మనం ఆదర్శవంతమైన మార్గంలో కనిపించడం కోసం.. జీవితాలను వృథా చేసుకుంటాము... కానీ అవి ఎప్పుడూ పని చేయవు. ఆ మార్గాలు నడవడికతో తయారవుతాయి.. వేచి ఉండవు" అని పోస్ట్ చేసింది. ఈ పోస్ట్ తో తన ఆలోచనలను సానియా ప్రతిబింబించింది. తన ఒంటరి ప్రయాణం నుంచి మరలి జీవితంలో చురుకైన చర్యలకు రెడీ అవుతున్నానన్న సంకేతాన్ని ఇచ్చింది. సానియా భర్త నుంచి విడిపోతున్నట్లు ప్రకటించినప్పటి నుండి అభిమానులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు తనకు అండగా నిలిచారు. మాలిక్‌తో తనకు ఇజాన్ అనే కొడుకు ఉన్నాడు గనుక.. సానియా బాలుడి బాధ్యతలను చూస్తోంది. తన కొడుకు ప్రస్తుతం దుబాయ్ లో రెండవ తరగతి



చదువుతున్నందన భారతదేశం-దుబాయ్ మధ్య తన బాధ్యతలను సమతుల్యం చేస్తోంది. విడాకుల తరువాత మానసిక గందరగోళం ఎదురైనా కానీ.. సానియా పూర్తిగా తన కొడుకు శ్రేయస్సుపై దృష్టి సారించింది. ఈ సవాల్ సమయంలో తల్లిగా తన బలాన్ని ప్రదర్శించేందుకు సానియా ఆసక్తిగా ఉంది. షోయబ్ మాలిక్ ఇటీవల నటి సనా జావేద్‌ను వివాహం చేసుకోవడంతో సానియా జీవితంపై మీడియా హంగామా పెరిగింది. సానియా తన వ్యక్తిగత భావాలను గోప్యంగా ఉంచాలనుకోవడానికి కారణమేమిటి? అంటూ ప్రశ్న ఎదురైంది. సోషల్ మీడియా కార్యకలాపాలు తరచుగా సానియా భావోద్వేగ స్థితిని సూచిస్తున్నాయి. మునుపటి పోస్ట్‌లలో, ఆమె సహనం, స్థిరత్వం నిండిన ఆలోచనల గురించి మనోభావాలను వ్యక్తం చేసింది. ప్రతికూల పరిస్థితుల మధ్య స్వీయ ప్రతిబింబంతో ఎదగాల్సిన ఆవశ్యకత గురించి నొక్కి చెప్పింది. సానియా ఇటీవలి కోట్‌లు వైద్యం, సాధికారత గురించినవి. ఇలాంటి పోరాటాలను ఎదుర్కొన్న అనేకమందికి ఇవి అర్థమయ్యాయి. సానియా మీర్జా తన ఒంటరి ప్రయాణంలో నిగూఢమైన పోస్ట్‌లు తన బలం సంకల్పాన్ని గుర్తు చేస్తున్నాయి. ఆమెకు మద్దతుగా ఉన్న అభిమానుల సమూహంతో నిరంతరం టచ్ లో ఉంది. తన కెరీర్ పిల్లల భవిష్యత్ గురించి ఆలోచిస్తోంది.

## చాకు లాంటి కుర్రాడితో ఖుషీ ఖుషీగా

అతిలోక సుందరి శ్రీదేవి- బోనీకపూర్ జంట కుమార్తెలు జాన్వీ కపూర్, ఖుషీ కపూర్ డేటింగ్ వ్యవహారాలపై నిరంతరం మీడియాలో గాసిప్స్ షికార్ చేస్తున్నాయి. జాన్వీ కపూర్ ఇప్పటికే పాపులర్ రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన శిఖర్ పహారియాతో డేటింగ్ లో ఉందంటూ ప్రచారం సాగుతోంది. అదే సమయంలో జాన్వీ సోదరి, అతిలోక సుందరి శ్రీదేవి రెండో కుమార్తె ఖుషి కపూర్ కూడా డేటింగ్ లో ఉందని ముంబై మీడియా కథనాలు అల్లుతోంది. ఖుషి ఇప్పటికే వేదంగ్ రైనాతో డేటింగ్ లో ఉందనేది బాలీవుడ్ మీడియా ప్రచారం. తాజాగా స్నేహితుడు వేదాంగ్ రైనాతో ఖుషి కపూర్ ఎలాంటి సందిగ్ధతలు, భేషజాలు లేకుండా జంటగా ర్యాంప్ వాక్ చేసి మురిపించింది. వేదాంగ్ కి ఖుషి సరైన జోడీ అనేంతగా ఆ ఇద్దరి జంట అందరి దృష్టిని ఆకర్షించింది. ర్యాంప్ పై ఆ ఇద్దరి నడుమా



కెమిస్ట్రీ అలాంటి రొమాంటిక్ వైబ్స్ ని వెదజల్లింది. ఈ జంటకు ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ గౌరవ్ గుప్తా దుస్తులను డిజైన్ చేసారు. ఫ్యూచరైజ్డ్ ఎథ్నిక్ ఈస్థెటిక్ - రీఇమాజినింగ్‌ను అరుణోదయ లుక్ ని డిజైన్ చేయడం ద్వారా గౌరంగ్ ఫ్యాషన్ సెన్స్ ఆసక్తిని కలిగించింది. రిలయన్స్ బ్రాండ్స్ లిమిటెడ్, %ఖీణజ×% ఇనిషియేటివ్ అయిన రిలయన్స్ బ్రాండ్స్ లిమిటెడ్‌తో కలిసి నిర్వహించిన ఈవెంట్ లో ఖుషి- వేదాంగ్ రైనా షోస్టాపర్లుగా నిలిచారు. మెర్మైడ్-కట్ హెమ్‌లైన్ - స్టేట్‌మెంట్ సిల్వర్ ఎంబ్రాయిడరీతో స్వెల్ట్ ఐవరీ నంబర్‌ను ధరించి ర్యాంప్‌పై నడిచిన మొదటి నటిగా ఖుషీ రికార్డులకెక్కింది. వేదాంగ్ పాక్షికంగా-సీక్విన్డ్ ఆల్-బ్లాక్ బంద్‌గాలా దుస్తులను ధరించి స్టైలిష్ గా కనిపించారు. ఈ జంట ర్యాంప్ వాక్ సమయంలో అద్భుతమైన కెమిస్ట్రీతో అలరించారు. ఖుషీ- వేదాంగ్ కొంతకాలంగా ఒకరికొకరు సన్నిహితంగా ఉన్నారని ముంబై మీడియా చెబుతోంది. ది ఆర్చీస్ ప్రమోషన్‌ల సమయంలో ఈ జంట పబ్లిక్ ప్రదర్శనలు ఆకర్షించాయి. వారి రొమాంటిక్ డేట్ గురించి మీడియాలో కథనాలొచ్చాయి. కానీ ఈ జంట తమ డేటింగ్ ని ఇంకా ఖరారు చేయలేదు.




**హైదరాబాద్: కొత్తగా ఇళ్లు నిర్మించుకొని విద్యుత్ మీటర్ బిగించుకోని వారికి ప్రభుత్వం రూ.825కే మీటర్లు ఏర్పాటు చేయనుంది. Sep 15 వరకు సిబ్బంది గ్రామాల్లో తిరిగి మీటర్లు లేని పేదలను గుర్తిస్తారు. సాధారణంగా మీటర్ల కోసం మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. కానీ ప్రస్తుతం సిబ్బందికి డబ్బులిస్తే నేరుగా రశీదు తీసుకునే వెసులుబాటు ఉంది. వారు గృహజ్యోతి కోసం ఈ నెల 17న మొదలయ్యే ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలి.**

# వరద నష్టంపై రేవంత్ సర్కార్‌కు కేంద్రం లేఖ




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4: తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కేంద్ర హెూంశాఖ లేఖ రాసింది. తెలంగాణలో వరద నష్టం వివరాలు నిర్ణీత ఫార్మాట్లో తక్షణమే పంపాలని కేంద్ర హెూమ్ శాఖ సూచించింది. 1345 కోట్ల రూపాయల ఎస్‌డీఆర్ఎఫ్ నిధులు ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్నాయని కేంద్రం వెల్లడించింది. వరదల్లో సాయం చేసినందుకు ఇప్పటికే 12 ఎన్‌డీఆర్ఎఫ్ దళాలు, రెండు హెలికాప్టర్లు పంపించినట్లు కేంద్ర హెూం శాఖ వెల్లడించింది. ఎస్డీఆర్ఎఫ్ నిధికి కేంద్రం వాటా నిధుల విడుదలకు తక్షణమే వివరాలు పంపాలని కేంద్రం ఆదేశించింది. జూన్‌లో 208 కోట్ల రూపాయల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి వినతి రాలేదని ఈ సందర్భంగా కేంద్రం తెలిపింది. ఇది వరకు ఖర్చు చేసిన వాటి యుటీలైజేషన్ సర్టిఫికెట్స్, వరద నష్టం వివరాలు పంపాలని కోరింది. వరద నష్టం వివరాలను ఎప్పటికప్పుడు రోజువారిగా పంపాలని తెలంగాణ ప్రభుత్వం ప్రధాన కార్యదర్శికి రాసిన లేఖలో కేంద్ర హెూంశాఖ కోరింది.

# వరదల కారణంగా భారీగా నష్టపోయిన రైతులు

ఖమ్మం: ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్, నేలకొండపల్లి మండలాల్లోని వరద ప్రాంతాల్లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. అతి భారీ వర్షాల కారణంగా తెలంగాణ రాష్ట్రంలో చాలా జిల్లాలు అతలాకుతలం అవుతున్నాయన్నారు. ఉమ్మడి ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు మహబూబాద్, ములుగు, నలగొండ జిల్లాల్లో భారీ నష్టం జరిగిందన్నారు. వాగులు, వంకలు పొరడం వల్ల రైతులకు అధిక నష్టం వాటిల్లిందని పొంగులేటి అన్నారు. అకస్మాత్తుగా వరదలు పెరిగిపోవడంతో ఇల్లు వదిలేసి కట్టుబట్టలతో ప్రజలు రోడ్డెక్కారన్నారు. ఇన్ని సంవత్సరాల్లో ఎప్పుడూ లేని విధంగా ఇంత ఉధృతంగా వర్షం వరదలు రాలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, విజయవాడ వరద ఖమ్మం జిల్లా నుంచి వెళుతుందని పొంగులేటి అన్నారు. వరదంతా పంట పొలాల్లో చేరి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. రైతుల బాధ, ఆవేదన వర్ణాతీతమన్నారు. ప్రత్యక్షంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల ఇళ్లకు వెళ్లి మరీ నష్టం ఎంత మేర జరిగిందో ప్రత్యక్షంగా చూసి చలించిపోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన రైతులకు అండగా నిలవాలని ఆ దిశగా ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రతి గ్రామంలో జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నానన్నారు. దీనిని జాతీయ విపత్తుగా కేంద్రం స్వీకరించి నష్టాన్ని అందజేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణకు రూ. 5438 కోట్లు అన్ని విధాలా నష్టం జరిగినట్లు కేంద్రానికి లేఖ ద్వారా తెలియజేశారని పొంగులేటి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా సహకరించి నష్టాన్ని



అందజేస్తుందని కోరుతున్నామని పొంగులేటి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన నష్టానికి ఎలా చేయాలనుకుంటుందో కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో జరిగిన విపత్తు కూడా అలానే సహాయం అందించాలన్నారు. ఈ రాష్ట్రంలో నష్టం జరిగిన రైతులు, ప్రజలకి ఈ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

అత్యవసరంగా కొంత సహాయంతో పాటు జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం ఆదుకుంటుందని పొంగులేటి తెలిపారు. ఈ వర్షానికి తడిసిన ధాన్యాన్ని సివిల్ సప్లై అధికారులు తీసుకొని ధాన్యానికి మద్దతు ధర ఇవ్వడం జరుగుతుందని భరోసా ఇచ్చారు. రైతులతో పాటు సామాన్య ప్రజానీకానికి ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని.. అవసరమైన సహాయాన్ని అందజేస్తుందని.. కాబట్టి ప్రజలు ఎవరు ఆందోళన చెందవద్దని పొంగులేటి తెలిపారు.

# లక్ష చెట్లు నేలకూలడంపై మంత్రి సీతక్క విస్మయం



ములుగు, సెప్టెంబర్ 4: మేడారంలో 500 ఎకరాల్లో చెట్లు నేలకొరగడంపై మంత్రి సీతక్క ఆరా తీశారు. రాష్ట్ర సచివాలయం నుంచి పీసీసీఎఫ్, డీఎఫ్ఓలతో టెలిఫోన్లలో మంత్రి మాట్లాడారు. రెండు రోజుల క్రితమే చెట్లు నేలకొరిగిన ప్రాంతాన్ని సీతక్క సందర్శించారు. లక్ష చెట్ల వరకు నేలకూలడం పట్ల మంత్రి విస్మయం చెందారు. ఈ స్థాయిలో అటవీ విధ్వంసం జరగడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ములుగు అడవుల్లో సుడిగాలి వల్ల లక్ష చెట్ల వరకు నేలకొరిగాయన్నారు. వందల ఎకరాల్లో నష్టం వాటిల్లిందని తెలిపారు. వృక్షాలు కూలడంపై విచారణకు ఆదేశించామన్నారు. డ్రోన్ కెమెరాల సహాయంతో జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. అడవిలో సుడిగాలి వచ్చింది కాబట్టి ప్రాణనష్టం జరగలేదన్నారు. ఈ సుడిగాలి గ్రామాల్లో సంభవించి ఉంటే పెను విధ్వంసం జరిగేదన్నారు. సమక్క సారలమ్మ తల్లుల దయ వల్లే సుడిగాలి ఊర్ల మీదకు రాలేదన్నారు. తల్లుల దీవేనతోనే ప్రజలకు సురక్షితంగా బయటపడగలిగారన్నారు. చెట్లు నేలకూలడంపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రం నుంచి పరిశోధన జరిపించి కారణాలు గుర్తించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అటవీ ప్రాంతంలో చెట్లను పెంచేలా ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని సీతక్క వినతి చేశారు.

# పారాలింపిక్స్‌లో భారత్ కొత్త రికార్డు.. అథ్లెట్లకు ప్రధాని మోదీ ఫోన్!

పారాలింపిక్స్‌లో భారత్ 20 పతకాలు సాధించి రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. గత టోక్యో పారాలింపిక్స్‌లో 19 పతకాలను సాధించిన భారత అథ్లెట్లు.. ఇప్పుడా సంఖ్యను దాటేశారు. ఇంకా పతకాంశాలు మిగిలే ఉన్నాయి. దీంతో టీమ్ఇండియా మెడల్స్ మరిన్ని పెరిగే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ అథ్లెట్లతో ప్రత్యేకంగా సంభాషించారు. పతకాలు గెలిచిన అథ్లెట్లకు అభినందనలు తెలిపారు. బరిలో నిలిచిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రధాని మోదీ బ్రూనై నుంచి సింగపూర్ పర్యటనకు మోదీ బయల్దేరారు. బ్రూనైలో అధికారిక సమావేశాలు ముగిసిన అనంతరం అథ్లెట్లతో మోదీ ప్రత్యేకంగా సంభాషించారు. పతకాలు సాధించిన దీప్తి జీవాంజి, మరియప్పన్ తంగవేలు, శరద్ కుమార్, సుందర్ సింగ్ గుర్జార్, అజీత్ సింగ్ తదితరులను అభినందిస్తూ మోదీ ఇప్పటికే సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

**ఈసారి లక్ష్యం 25..** పారాలింపిక్స్ ప్రారంభానికి ముందు భారత్ 25 పతకాలను లక్ష్యం చేసుకొని బరిలోకి దిగింది. మొత్తం 84 మందితో కూడిన అథ్లెట్ల బృందం పారిస్‌కు చేరుకుంది. టోక్యో రికార్డును అధిగమించిన భారత్.. 'పాతిక' టార్గెట్‌ను కొట్టడం కష్టమేం కాదు.

కేంద్రం నుంచి పారా అథ్లెట్లకు పూర్తిస్థాయిలో సహకారం లభించడం వల్లే ఇదంతా సాధ్యమైంది. అత్యున్నత స్థాయిలో శిక్షణ, పరికరాలు, విదేశీ నిపుణుల సూచనలు అందేలా చేయడం, సాయ్ క్రీడా కేంద్రాల్లో సాధన కీలక పాత్ర పోషించాయి. క్రీడాకారులను సమాయత్తం చేసేందుకు అంతర్జాతీయ స్థాయిలో 110కిపైగా పోటీలకు పంపించింది. పారాలింపిక్స్‌లో పతకాల వేటకు బరిలోకి దిగిన అథ్లెట్ల కోసం రూ.22 కోట్లు కేటాయించగా.. క్వాలిఫైడ్ అంశాల కోసం రూ. 74 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.




హైదరాబాద్: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం అన్నాలోని రోడ్డు నం.75లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు భారతీయులు మృతిచెందారు. వీరిలో ముగ్గురు హైదరాబాద్‌కు చెందిన వారు కాగా.. మరొకరు తమిళనాడు వాసి. శుక్రవారం చోటుచేసుకున్న ఈ ప్రమాదం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతుల్లో హైదరాబాద్‌కు చెందిన ఆర్యన్ రఘునాథ్, ఫరూఖ్, లోకేశ్ పాలచర్ల, తమిళనాడుకు చెందిన దర్శిని వాసుదేవన్ ఉన్నట్లు అక్కడి అధికారులు వెల్లడించారు. కార్ పూలింగ్ ద్వారా ఈ నలుగురు బెన్‌టోన్‌విల్లె ప్రాంతానికి వెళ్లేందుకు ఒకే వాహనంలో ఎక్కారని తెలిపారు. వరుసగా 5 వాహనాలు ఒకదానినొకటి అతివేగంగా ఢీకొనడంతో ప్రమాదం సంభవించినట్లు అధికారులు వెల్లడించారు. డల్లాస్‌లో బంధువును కలిసి ఇంటికి వెళ్తున్న ఆర్యన్ రఘునాథ్, భార్యను కలిసేందుకు లోకేశ్, యూనివర్సిటీకి వెళ్తున్న దర్శిని వాసుదేవన్, ఫరూఖ్ ఈ కారులో ఎక్కారు. వీరు ప్రయాణిస్తున్న వాహనానికి మంటలు అంటుకోవడంతో బయటకు రాలేకపోయినట్లు తెలుస్తోంది. వీరి మృతదేహాలు గుర్తు పట్టలేనంతగా కాలిపోవడంతో కార్ పూలింగ్ యాప్‌లో నమోదైన వివరాల ఆధారంగా ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. వీరి మృతిపై స్నేహితులు, బంధువులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.




తెలుగు రాష్ట్రాల్లో వరద బాధితుల సహాయార్థం చిరంజీవి భారీ విరాళమిచ్చారు. రెండు రాష్ట్రాలకు కలిపి రూ.కోటి విరాళం ప్రకటించారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రుల సహాయనిధికి చెరో రూ.50 లక్షలు ప్రకటించారు. 'తెలుగు రాష్ట్రాల్లో వరద ప్రభావం వల్ల ప్రజలకు కలిగిన, కలుగుతున్న కష్టాలు నన్ను కలచివేస్తున్నాయి. పదుల సంఖ్యలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం ఎంతో విషాదకరం. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల నాయకత్వంలో రెండు ప్రభుత్వాలు శాయశక్తులా పరిస్థితిని మెరుగుపరచడానికి కృషి చేస్తున్నాయి. మనందరం ఏదోవిధంగా సహాయక చర్యల్లో పాలుపంచుకోవాల్సిన అవసరం ఉంది. ఈ ప్రక్రియలో భాగంగా రెండు రాష్ట్రాల్లోని ప్రజల ఉపశమనానికి తోడ్పాటుగా నా వంతు కోటి రూపాయలు విరాళంగా ప్రకటిస్తున్నాను . ఈ విపత్కర పరిస్థితులు తొందరగా తొలగిపోవాలని ప్రజలంతా సురక్షితంగా ఉండాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను' అని పేర్కొన్నారు.

# విపత్తు వేళ.. ప్రయాణికులకు ఊరట కల్పించిన టీజీఎస్ ఆర్టీసీ

హైదరాబాద్: భారీ వర్షాలు, వరదలు తెలుగు రాష్ట్రాలను అతలాకుతలం చేస్తున్నాయి. దీంతో రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులు గత కొన్ని రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్–విజయవాడ మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులకు టికెట్ ధరలో 10 శాతం రాయితీ ఇవ్వనున్నట్టు ప్రకటించింది. రాజధాని, ఏసీ, సూపర్ లగ్జరీ బస్సులలో ఈ రాయితీ వర్తిస్తుందని తెలిపింది. ముందస్తు రిజర్వేషన్ కోసం https://www.tgsrtcbus.inలో టికెట్లు బుక్ చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు.

# గురుకులాలను శిథిలం చేయాలని రేవంత్ సర్కార్ కుట్ర

హైదరాబాద్, సెప్టెంబర్ 4: రేవంత్ రెడ్డి ప్రభుత్వం గురుకులాలను శిథిలం చేయాలని కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... కుట్రలో సమిధలు అవుతున్నది ఎస్సీలని తెలిపారు. ఎస్సీ గురుకులాల్లో 2000 మంది ఉపాధ్యాయులను రాత్రికి రాత్రే ఉద్యోగాల నుంచి తొలగించారన్నారు. రాజ్యాంగ, చట్టబద్ధంగా నిబంధనలకు లోబడి నియామకాలు జరిగిన వారిని తొలగించారని మండిపడ్డారు. 2000 మంది నోట్లో రేవంత్ రెడ్డి మట్టి కొట్టారంటూ విరుచుకుపడ్డారు. రెండు లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారిందన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో గతంలో ఇంజనీర్లు, డాక్టర్లు అయితే... ఇపుడు మళ్లీ పశువులు కాసే పరిస్థితికి తీసుకొచ్చారన్నారు. వెయ్యి మంది డాక్టర్లను చేసిన గౌలిదొడ్డి గురుకులంలో ఉపాధ్యాయులు సమ్మె చేసే పరిస్థితి వచ్చిందన్నారు. పేద పిల్లల కోసం ఏర్పాటు చేసిన క్రీడా అకాడమీలు మూత పడ్డాయన్నారు. హ్యాండ్ బాల్ క్రీడాకారుడు తిరుపతికి రెండు లక్షల రూపాయలు ప్రభుత్వం ఇవ్వకపోతే... కేటీఆర్ తాను సాయం చేస్తానని హామీ ఇచ్చారన్నారు. రుక్మాపూర్ గురుకుల సైనిక పాఠశాల, భువనగిరి సైనిక కళాశాల నుంచి సైనిక అధికారులు వెళ్ళిపోయే పరిస్థితి తీసుకొచ్చారన్నారు. మ్యూజిక్, ఒకేషనల్ కళాశాలల నుంచి సిబ్బందిని తొలగించారని మండిపడ్డారు. పేద విద్యార్థులు అంటే రేవంత్ రెడ్డికి ఎందుకంత కోపమని ప్రశ్నించారు. అన్ని వర్గాల వారు మేల్కొని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర నుంచి గురుకులాలను కాపాడుకోవాలన్నారు. తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ డిమాండ్ చేశారు.

# ప్రభుత్వం మారినా పోలీసుల తీరు మారలేదు..

హైదరాబాద్, సెప్టెంబర్ 4: ప్రభుత్వం మారినా పోలీసుల తీరు మారలేదని ఎమ్మెల్యే వేముల వీరేశం ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో ఉన్న పోకడలనే పోలీసులు ఇంకా కొనసాగిస్తున్నారన్నారు. నల్గొండ జిల్లాలో ఒకరిద్దరు పోలీసు అధికారులు ఇంకా గత ప్రభుత్వంలో ఉన్నట్టే ఉన్నారన్నారు. "మమ్మల్ని గుర్తు పట్టనివారు మాకు ఎలాంటి రక్షణ కల్పిస్తారు. ప్రోటోకాల్ పాటించని అధికారులను పిలిచి విచారణ చేస్తానని స్పీకర్ చెప్పారు. దళిత ఎమ్మెల్యేలపై మాత్రమే కాదు ఏ ప్రజాప్రతినిధికి కూడా ఇలా కావద్దు. పోలీసు అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని స్పీకర్‌కు ఫిర్యాదు చేశాను" అని ఎమ్మెల్యే తెలిపారు. ఆగష్టు 30 వ తేదిన జరిగిన సమావేశంలో అధికారులు ప్రోటోకాల్ పాటించలేదన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 94, 19 ప్రకారం తనను అవమానించినందుకు డీసీపీ, ఏసీపీలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ప్రోటోకాల్ నిబంధనల్ని తుంగలో తొక్కడం సరికాదన్నారు. "నాపై మాత్రమే కాదు, ఏ ప్రజాప్రతినిధులపై ఇలా జరగకూడదు. గత ప్రభుత్వంలో అనేక హింసను, అవమానాలను ఎదుర్కొన్నాం. అధికారులు కొందరు శత్రువుల ముందు మమ్మల్ని బలహీన పరిస్తున్నారు. డీసీపీ, ఏసీపీ తప్పు చేసి కానిస్టేబుల్స్‌పై చర్యలు తీసుకుంటే ఎలా?" అంటూ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రశ్నించారు.

**అసలేం జరిగిందంటే...** కాగా.. నాలుగు రోజుక్రితం ప్రభుత్వ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేను పోలీసులు గుర్తుపట్టకపోవడం చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన నిమిత్తం మంత్రులు సహా ఉమ్మడి నల్గొండ జిల్లాకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ఆగస్టు 30న భువనగిరికి వెళ్లారు. ఈ క్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశానికి చేదు అనుభవం ఎదురైంది. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆగస్టు 30న భువనగిరిలో పర్యటించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి నీటిపారుదల శాఖ పనులపై మంత్రులు సమీక్ష నిర్వహించారు. వారంతా ప్రత్యేక హెలికాప్టర్‌లో భువనగిరికి చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్దకు చేరుకోగానే మంత్రులకు స్వాగతం పలికేందుకు ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు క్యూ కట్టారు. అయితే వారికి స్వాగతం పలికేందుకు హెలీప్యాడ్ వద్దకు వెళ్లిన వేముల వీరేశాన్ని పోలీసులు అడ్డుకున్నారు.
దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఎమ్మెల్యే.. పోలీసులకు కామన్ సెన్స్ ఉండదా అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేను గుర్తుపట్టే స్థాయిలో పోలీసులు లేరా? అంటూ ఆగ్రహించారు. చివరకు తాను ఎమ్మెల్యేలను అని పోలీసులకు చెప్పుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. . ఈ అవమానంతో వీరేశం అక్కడి నుంచి అలిగి వెళ్లిపోవాలనుకున్నారు. అక్కడే ఉన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి కలగజేసుకుని సముదాయించే ప్రయత్నించారు. నేతలు చెప్పినా వినకుండా అలకబూని అక్కడి నుంచి వెళ్లిపోయారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com